ప్రజాశక్తి

బుధవారం 9 అక్టోబర్ 2024 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

నేటి అలంకరణ

రెండో రోజూ రగడే

గన్నవరంలో మద్యం టెండరుదారులపై దౌర్జన్యం

ప్రజాశక్తి-గన్నవరం

మద్యం వ్యాపారానికి రాజకీయ నేతలకు విడదీయరాని అనుబంధం ఉంటుంది. ఇందులో ఎక్కువగా రాజకీయ నేపథ్యం ఉన్న వారే ఉంటారు. పెత్తనం చెలాయిస్తుంటారు. నూతన మద్యం విధానంలో భాగంగా ప్రభుత్వం ప్రైవేటు మద్యం దుకాణాలకు దరఖాస్తులను ఆహ్వానించింది. దీంతో చాలా చోట్ల ప్రజాప్రతినిధులు, నేతల చూపు మద్యం దుకాణాలపై పడింది. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కీలక నేతలు దరఖాస్తు చేయకుండా అడ్డుకుంటున్నారు. తామే వ్యాపారం చేయాలని, ఇతరులు అడుగుపెట్టకూడదని శాసిస్తున్నారు. పలు చోట్ల సిండికేట్ కడుతున్నారు. దీంతో దరఖాస్తుల రూపంలో ప్రభుత్వానికి జమ కావాల్సిన రాబడికి గండి పడుతోంది. దరఖాస్తులు సమర్పించేందుకు ఒక రోజు సమయం ఉండటంతో ప్రజాప్రతినిధులు దుకాణాలను చేజిక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు.

గన్నవరం నియోజకవర్గానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి అనుచరులు టెండర్లు వేయకుండా అడ్డుకుంటున్నారు. మంగళవారం కూడా ఇదే విధానం కొనసాగింది. నరేష్ అనే యువకుడు ముస్తాబాద్‌కు చెందిన టిడిపి సీనియర్ నాయకుడు కంచర్ల ఈశ్వరరావుపై దౌర్జన్యం చేసిన ఘటన ఎక్సైజ్ కార్యాలయం వద్ద చోటుచేసుకుంది. 'మా నేత టెండర్ వెయ్యవద్దని చెప్పాడుగా ఎందుకు వచ్చావు.. టిడిపి నాయకుడు వైతే నీకు చెప్పాలా బొట్టు పెట్టి.. నోరు మూసుకుని అవతలికి వెళ్లు' అనడంతో ఈశ్వరరావు ప్రతి స్పందించాడు. దీంతో యువకులు రెచ్చిపోవడంతో అలజడి చోటుచేసుకుంది. ఈశ్వరరావు భయంతో తాను ఎమ్మెల్యేతో చెబుతానని అనడంతో.. ఆఫీసులో ఉన్నారు వెళ్లి చెప్పుకో అంటూ యువకులు ఎగబడ్డారు. దీంతో ఈశ్వరరావు టిడిపి కార్యాలయానికి వెళ్లడంతో క్లాస్ పీకారని తెలిసింది.

గన్నవరం నియోజకవర్గంలో మద్యం షాపులకు నేరుగా టెండర్లు వేయడానికి ఎక్సైజ్ కార్యాలయానికి వస్తున్న వారు ఏం జరుగుతుందోనని భయం గుప్పెట్లో వెళ్లాల్సిన పరిస్థితి ఎదుంవుతుంది. పోలీసులు కాపలా కాస్తున్నా ఈ గొడవలు ఆగడం లేదు. పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారనే విమర్శ ఉంది. నియోజకవర్గ నేత ఆధ్వర్యంలో సిండికేట్ ఒకటి ఏర్పాటు అవుతుందని సమాచారం. వాళ్లే టెండర్లు వేయాలనే పరిస్థితి ఉంది. ఆపడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. కాదంటే బెదిరిస్తున్నారు. ఈ సంస్కృతిపై గతంలో వ్యాపారం చేసిన మద్యం వ్యాపారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీని నమ్ముకున్న వాళ్లను కూడా టెండర్లు (మిగతా 2లో)

అభ్యుదయ కిరణం జోత్స్న

- పలువురు నేతల సంతాపం
- మహిళా ఉద్యమాల్లో చురుకైన పాత్ర
- బహుముఖ కార్యక్రమాలతో సమాజ చైతన్యం కోసం కృషి

గుళ్లపల్లి జోత్స్న

ప్రజాశక్తి - విజయవాడ : రాజస్థాన్లో మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో తుదిశ్వాస విడిచిన గుళ్లపల్లి జోత్స్న మొదటి నుండీ వామపక్ష, అభ్యుదయ భావాలతో జీవించారు. మహిళా ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారు. సమాజం మారాలని, ముఖ్యంగా మహిళల్లో చైతన్యం పెరగాలని, వివక్ష పోవాలనే తపనతో ఉన్నత స్థాయి చదువులు చదివి, ఆర్థికంగా ఎటువంటి లోటులేకపోయినా సమాజ మార్పుకు కృషి చేస్తూ బహుముఖ కార్యక్రమాలు నిర్వహించారు. బాలికల్లో అక్షరాస్యత శాతం పెరగాలని, విద్య ద్వారానే సమాజం ముందడుగు వేస్తుందని, సారా మహమ్మారితో ఇల్లు, వళ్లు గుల్లవతుందని ఉద్దేశంతో మహిళల్లో చైతన్యం కోసం పరితపించారు. చిన్ననాటి నుంచి సామాజిక స్పృహతో పని చేశారు. ఏ కార్యక్రమం చేపట్టినా దానిని విజయవంతం చేసేందుకు సృజనాత్మకతతో, అంకిత భావంతో, చిత్తశుద్ధితో, ఎంతోపట్టుదలతో పనిచేసేవారు. పెద్దమ్మ సరోజనమ్మ వద్ద పెరిగిన జోత్స్న... సిపిఎం అగ్రనేత మోటూరు హనుమంతరావు - ఉదయం శిష్యరికంలో వామపక్ష భావాలు పుణికిపుచ్చుకున్నారు. తన జీవితాన్ని సమాజం మార్పుకే కేటాయించాలనే చిన్ననాడే నిర్ణయించుకున్న ఆమె తాను తుదిశ్వాస విడిచే వరకూ అదే బాటలో నడిచారు. 1992లో ఐద్వా నేతలు మానుకొండ సూర్యావతి, భిక్షవతి నేతృత్వంలో ఉమ్మడి రాష్ట్రంలో పెద్దఎత్తున సాగిన సారా (మద్యం) నిషేధ ఉద్యమంలో (మిగతా 2లో)

రూ.115కే పామాయిల్

9 నుంచి అన్ని రైతుబజార్లలో లభ్యం : జెసి నిధి మీనా

ప్రజాశక్తి-విజయవాడ : పెరిగిన వంట నూనెల ధరలను దష్టిలో ఉంచుకొని ఈనెల 9వ తేదీ బుధవారం నుంచి అన్ని రైతు బజార్లలో రూ. 115కే పామాయిల్ ప్యాకెట్ అందుబాటులో ఉంచడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా తెలిపారు.మంగళవారం జాయింట్ కలెక్టర్ నిధి మీనా.. పౌరసరఫరాల అధికారులు, వ్యాపార సంఘాల ప్రతినిధులు తదితరులతో జిల్లా ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ధనల స్థితిగతుల మేరకు రైతు బజార్లలో గతంలో బియ్యం, కందిపప్పు తదితర నిత్యవసర సరుకులను తక్కువ ధరలకు రైతు బజార్లలో అందుబాటులో ఉంచడం జరిగిందని.. ఇదేవిధంగా ఇప్పుడు వంట నూనెల ధరలు పెరిగిన నేపథ్యంలో పామాయిల్ ను తక్కువ ధరకు అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ ఏర్పాటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో పౌరసరఫరాల డీఎం జి.వెంకటేశ్వర్లు, జిల్లా పౌరసరఫరాల అధికారి పాపారావు, వ్యాపార సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పల్లె పండగకు సిద్ధం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ : పల్లె పండుగ- పంచాయతీ వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ అన్నారు. మంగళవారం ఉదయం అమరావతి సచివాలయం నుండి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లతో ఈ నెల 14 నుండి 20 వరకు జిల్లాలలో నిర్వహించే పల్లె పండుగ- పంచాయతీ వారోత్సవాల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ డా. జి సజన, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ సునీత ఆర్ అండ్ బి ఎస్ఈ ......సంబందిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, గ్రామ సర్పంచులు, ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలన్నారు. గత ఆగస్టు 23న రాష్ట్రవ్యాప్తంగా 13,325 పంచాయతీల్లో ఒకే రోజు గ్రామ సభలు నిర్వహించి తీర్మానాలు చేయించిన పనులకు కలెక్టర్లే పరిపాలన అనుమతులు ఇవ్వడం జరిగిందని, అన్ని పనులు 14 నుంచి వారం రోజుల వ్యవధిలో శంకుస్థాపనలు నిర్వహించి, సంక్రాంతి లోగా పనులు పూర్తి చేయించాలని కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధులు రూ.2,500 కోట్లతో దాదాపు 20వేల పనులకు శంకుస్థాపనలు జరగనున్నాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.జిల్లాలో 90 కోట్ల రూపాయలతో సీసీ రోడ్లు, బిటి రోడ్లు, గోకులాల నిర్మాణ పనులు జిల్లా కలెక్టర్ జి సజన జిల్లాలో పల్లె పండగ- పంచాయతీ వారోత్సవాలను నిర్వహించేందుకు పూర్తి సంసిద్ధంగా ఉన్నామని అన్నారు. జిల్లాలో భూమి పూజ నిర్వహించవలసిన అన్ని పనులను గుర్తించామని తెలిపారు. ప్రజాప్రతినిధులకు సమాచారం ఇచ్చి షెడ్యూల్ తయారు చేసినట్లు తెలిపారు.

మూలా నక్షత్రం రోజున మరింతగా సౌకర్యాలను కల్పించండి : విఎంసి కమిషనర్

ప్రజాశక్తి-విజయవాడ : మూలానక్షత్రం నాడు భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగర కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఉదయం శాఖధిపతులతో, దసరా నవరాత్రుల ఏర్పాట్లలో ఫీల్డ్ వర్క్ లో ఉన్న అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

రెండో రోజూ రగడే

(మొదటి పేజీ తరువాయి)

వేయనీయకుంటే ఎలా అంటూ ఆగ్రహిస్తున్నారు. మొత్తం 30 మంది సభ్యులు ఈ సిండికేట్లో ఉన్నారని అంటున్నారు. నియోజకవర్గంలో 23 దుకాణాలకు వీరు టెండర్లు వేయాలని నిర్ణయించారు. సిండికేట్లోని ఐదుగురు కలిసి ఒక్కో దుకాణానికి టెండర్ వేస్తున్నారు. వీరిలో ఎవరికి దుకాణం వచ్చినా అందరూ కలిసి పెట్టుబడులు పెట్టి సమాన వాటాలు తీసుకునేలా అవగాహనకు వచ్చారు. మొత్తం పెట్టుబడి నేతే పెడతారని ఆలోచన కూడా ఉన్నట్లుగా తెలుస్తుంది. మంగళవారం నాటికి గన్నవరం పరిధిలో 23 దుకాణాలకు 108 దరఖాస్తులు వచ్చాయి. ఎవరినీ దరఖాస్తు చేయొద్దని కీలక నేత అనుచరులు ఇప్పటికే ఔత్సాహికులకు గట్టిగా చెప్పారు. తాము గతంలోనూ ఇదే వ్యాపారం చేసే వారమని మొత్తుకున్నా వేయడానికి వీల్లేదని ఖరాకండిగా చెప్పేశారు. గన్నవరం ఎక్సైజ్ కార్యాలయంలో మకాం వేసి.. బయటి వ్యక్తులు దరఖాస్తులు సమర్పించకుండా పహారా ఏర్పాటు చేయడం గమనార్హం. దరఖాస్తు చేసేందుకు కొందరు వెళ్లగా అడ్డుకుంటున్నారు. వెనక్కు వెళ్లిపోవాలని రుబాబు చేస్తున్నారు. తాము చెప్పిన విధంగా నడుచుకోవాలని హుకుం జారీ చేస్తున్నారు. అయితే టిడిపి నాయకులు చాలామంది రహస్యంగా టెండర్లు వేస్తున్నారు. ఆన్లైన్లో ఎక్కువ మంది టెండర్లు వేస్తున్నట్లుగా తెలుస్తోంది. నేరుగా టెండర్లు వేయడానికి ఎక్సైజ్ కార్యాలయానికి వస్తున్న వారిని ప్రైవేట్ వ్యక్తులు అడ్డుకొని గొడవ చేస్తున్న విషయం దావాహలంగా వ్యాపించింది. ప్రతి ఒక్కరి నోట ఇదే చర్చ సాగుతోంది. గతంలో ఎన్నడూ ఏ నాయకుడు ఈ విధంగా చేయలేదని, ఒకవేళ వ్యాపారం చేసుకోవాలని సిద్ధమైతే అందరినీ కలుపుకొని ఒక విధానంలో ముందుకు వెళ్లిన పరిస్థితి ఉందని ఓ సీనియర్ వ్యాపారి చెప్పడం గమనార్హం. టెండర్ వేయకుండా అడ్డుకోవడం కొత్త సంస్కృతికి తెరలేపినట్లు అయిందని టిడిపి నాయకులు అంటున్నారు. అయితే యువకుల చేతిలో భంగపాటుకు గురైన టిడిపి సీనియర్ నాయకుడు కంచర్ల ఈశ్వరరావు తనపై జరిగిన దౌర్జన్యాన్ని మీడియాకు చెప్పుకొని కన్నీటి పర్యంతమయ్యాడు. టిడిపిలో ఉన్నందుకు, పార్టీ అభివద్ధి కోసం పని చేసినందుకు ఈరోజు వాళ్ల చేతిలోనే దెబ్బలు తినాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

In the Court of the IIIrd Additional District Judge at Kakinada (MACT)

M.V.O.P. No. 110/2021

Between:
Dangudubiyyam Lakshmi and Others
...Petitioners
AND
Gubbala Raju and Others
...Respondents

To: **2nd Respondent:** Velugu Nageswara Rao, S/o. Subba Rao, Hindu, age 50 years, R/o. D.No. 6-13/1-26, Gollapalem Gattu, Kothapeta, Vijayawada Urban, AP 520001, Owner of Mahendra Goods Van bearing No: AP 39 Y 1777.

పై నెంబరు పిటిషన్‌లో 2వ రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారాను, పోస్టల్ ద్వారాను ఎన్నిసార్లు నోటీసులు పంపిన మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 22-10-2024వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల పై పిటిషన్ మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

చిక్కాల వీర వెంకట సత్యనారాయణ (అబ్బు)
అడ్వకేట్, రామారావుపేట
కాకినాడ, సెల్: 9848252425

అభ్యుదయ కిరణం జోత్స్న

(మొదటి పేజీ తరువాయి)

తనవంతుగా విజయవాడలో సాగిన పోరాటంలో చురుకైన పాత్ర పోషించారు. రాష్ట్రంలోనే మొదటగా 1992లో ఏర్పాటు చేసిన కృష్ణాజిల్లా మహిళా న్యాయ సలహా సంఘం కేంద్రాన్ని నగరంలోని నక్కల రోడ్డులో గత తన ఇంట్లోనే ఏర్పాటు చేశారు. కుటుంబాల్లో మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు, ఇబ్బందుల పరిష్కారానికి లీగల్ సెల్ ద్వారా ఆమె అప్పట్లోనే ఎంతో కృషి చేశారు. నగరంలో ఉన్న అనేక మహిళా సంఘాలు, సంస్థలు, అనేక రంగాల్లో ఉన్న ప్రముఖులు, వ్యక్తులతో 2018లో మహిళా సాధికారిత పేరుతో నిర్వహించిన అనేక కార్యక్రమాల్లో జ్యోత్స్న కీలకంగా వ్యవహించారు. అలాగే అనేక రంగాల్లో ఉన్న ప్రముఖులతో 'తరుణీ తరంగాలు'ను ఏర్పాటు చేసి, దానికి ప్రధాన కార్యదర్శిగా వ్యవహిస్తున్నారు. నాలుగేళ్లపాటు అవిశ్రాంతంగా పని చేశారు. 2022లో సమానత్వం కోసం ఒక అడుగు ముందుకు (సేఫ్ – స్టెప్ ఎహెడ్ ఫర్ ఈక్వాలిటీ) సంస్థను స్థాపించి, పలు కళాశాలల్లో కమిటీలను ఏర్పాటు చేశారు. కళాశాలల యాజమాన్యాల అంగీకారంతో మూడేళ్లపాడు పలు అంశాలపై సాంస్కృతిక కార్యక్రమాలు, వర్క్‌షాపులు, సదస్సులు నిర్వహించారు. బాలబాలికల్లో విద్య ఆవశ్యకత, సామాజిక స్పృహ ఆవశ్యకత తదితర అంశాలపై విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టారు. 2023లో సైన్స్ ఫెస్ట్‌ను భారీ ఎత్తున నిర్వహించడంతో ఆమె పాత్ర మరువలేనిది. అమరావతి బాలోత్సవ్ కమిటీకి ఆరేళ్లు కార్యదర్శిగా ఉండి విశేష కృషి చేశారు. సిఐటియు సిటీ ఆఫీసు బేరర్‌గా, శ్రామిక మహిళా కన్వీనర్‌గా, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ బాధ్యతల్లోనూ పనిచేశారు. విజయవాడ నగరాభివృద్ధికి పలవు వేదికలపై ప్రజాసమస్యలను తీసుకెళ్లి, వాటిని వెలుగులోకి తీసుకొచ్చేందుకు శ్రమించారు. మహిళా సంఘాలు, సంస్థలు, సేఫ్ సంయుక్త ఆధ్వర్యాన నగరంలో ఈ ఏడాది సెప్టెంబరు 26 నుంచి 28 వరకు దసరా ఉత్సవాలను పెద్దఎత్తున నిర్వహించడంలో ప్రధాన భూమిక పోషించారు. 1979లో పాట్నాలో జరిగిన ఎస్ఎఫ్ఐ ఆల్ ఇండియా కాన్ఫరెన్స్‌కు విజయవాడ నుంచి ప్రతినిధిగా వెళ్లారు. ఇటీవల ఇంటిని సైతం తనకు ఇష్టమైన రీతిలో తీర్చిదిద్దుకునే వారు. టెర్రస్ గార్డెన్, రూఫ్‌గార్డెనింగ్ ఏ విధంగా ఉపయోగపడుతుంతో ప్రజల్లో అవగాహన కల్పించడంలో ముందుండే వారు. 1995, 2005 కార్పొరేషన్ ఎన్నికల్లో గాదె ఆదిలక్ష్మి, కాజ సరోజ కార్పొరేటర్లుగా గెలుపొందడంలో సహకారం అందించారు.

ప్రమాదానికి గురైన బస్సు, లారీ

కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి, ఎంబివికె బాధ్యులు కె.స్వరూపరాణి

సిపిఎం, ప్రజా, న్యాయవాద సంఘాల నేతలు సంతాపం

సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కాజ సరోజ, కె.శ్రీదేవి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్, సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎంవి.సుధాకర్, సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి రమణరావు, ఎంబివికె బాధ్యులు ఎంబివికె బాధ్యులు పి.విజయ, అమరావతి బాలోత్సవ్ కమిటీ నిర్వాహకులు వై.సుబ్బారావు తదితరులు జ్యోత్స్న ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆమె మృతికి సంతాపం తెలిపారు. ఐలు రాష్ట్ర నాయకులు నాయకులు ఆలూరి సుధాకర్, సంపర దుర్గా శ్రీనివాసరావు, వేము కోటేశ్వరరావు, బొమ్మసాని రవి, ఎస్.రమేష్ బాబు, బార్ కౌన్సిల్ సభ్యులు చలసాని అజయ్ కుమార్, విజయవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు గోగిశెట్టి వెంకటేశ్వరరావు, టిడిపి లీగల్ సెల్ నాయకులు గూడపాటి లక్ష్మీనారాయణ, టిడిపి నాయకులు చెరుకూరి శ్రీపతి రావు, న్యాయవాది రావూరి రమేష్ తదితరులు జోత్స్న ఇంటికి చేరుకొని ఆమె మృతికి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

ఐలు, ఐద్వా సంతాపం

జోత్స్న మృతికి ఐలు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.కుమార్, నల్లూరి మాధవరావు సంతాపం తెలిపారు. ఐలు రాష్ట్ర కమిటీ తరపున కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. మహిళా, సామాజిక సమస్యలపై పనిచేస్తున్న గుళ్లపల్లి జోత్స్న అకాల మృతి అత్యంత బాధాకరమని ఐద్వా ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె సరోజ, కె శ్రీదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె మృతిపట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. విద్యార్థి దశ నుంచి వివిధ ఉద్యమాల్లో జ్యోత్స్న చురుగ్గా పాల్గొన్నారని గుర్తుచేశారు.

బి.ఆర్.తులసీరావు సంతాపం

జోత్స్న మృతికి ఎంబి విజ్ఞాన కేంద్రం బాధ్యులు బి.ఆర్.తులసీరావు సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

రాజస్థాన్లో రోడ్డు ప్రమాదం ఇలా

విజయవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుమారు 78 మంది న్యాయవాదులు స్టడీ టూర్లో భాగంగా తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 2వ తేదీన విజయవాడలో బయలుదేరి రాజస్థాన్ వెళ్లారు. రాజస్థాన్లో జైపూర్ మీదుగా మీదుగా అజ్మీర్ వెళుతున్న సమయంలో మంగళవారం తెల్లవారుజామున జోద్‌పూర్ టోల్‌గేట్ సమీపంలో వీరు ప్రయాణిస్తున్న ప్రైవేటు బస్సు, లారీ ఢీనడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో జోత్స్న సంఘటనా స్థలంలోనే తుదిశ్వాస విడిచారు. ఈప్రమాదంలో ఆమె భర్త, ఐలు జాతీయ అధ్యక్షులు, ఎపి బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్ర ప్రసాద్‌తోపాటు 11 మందికి గాయాలు కావడంతో వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు.



ప్రజాశక్తి ప్రధాన కార్యాలయలో జరిగిన పూర్వ సంపాదకులు మోటూరు హనుమంతరావు 23వ వర్ధంతిలో జోత్స్న (ఫైల్)

పేరు మార్పు

నేను (A) అవనిగడ్డ విజయకుమార్ రాజు, S/o అవనిగడ్డ వెంకటేశ్వరరావు, నివాసం : డోర్ నెం. 63-2-17, పాత పోస్టాఫీస్ వీధి, పటమటలంక, విజయవాడ. తెలియజేయునదేమనగా నా యొక్క పూర్వపు పేరు (A) అవనిగడ్డ విజయకుమార్ రాజు ఇప్పుడు పేరుమార్పు చేసిన తర్వాత **విజయ్ జైన్, S/o (A) అవనిగడ్డ వెంకటేశ్వరరావు (VIJAY JAIN, S/o (A) AVANIGADDA VENKATESWARA RAO** గా నేటి నుండి పిలవబడును.

ప్రకటన

మహారాజశ్రీ కృష్ణాజిల్లా మచిలీపట్నం 6వ అదనపు జిల్లాజడ్జి వారి కోర్టులో

IA No. 129/2024 in IA 69/2023 in OS 19/2016

Between :
Pedamallu Lakshmi and another
.... Petitioners / Plaintiffs
And
Yenduri Surya Prakasa Rao and others
.... Respondents / Defendants

To,
Respondent No.16
Yenduri Benarji Rao, S/o. Narasimha Rao, Opp. Kalpana theatre, Bantumilli, Bantumilli Mandal, Krishna Dist.

పై నెంబరు IA No. 129/2024 in IA No. 69/2023 in OS No. 19/2016లో రెస్పాండెంట్ నెం.16 నకు Section 5 of Limitation Act Petition సంబంధించి నోటీసు నిమిత్తం ది. 29-10-2024వ తేదీకి వాయిదా అయివున్నది. కావున సదరు వాయిదారోజున ఉదయం 10-30 గం.లకు మీరు పై కోర్టువారి యెదుట స్వయంగా గానీ లేదా న్యాయవాది ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల మీకు పరోక్షంగా తదుపరి గ్రంథములు జరిపించబడునని ఇందుమూలంగా తెలియజేయటమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 29-10-2024

వి.రామ్‌ప్రసాద్
అడ్వకేట్
విజయవాడ.

ఎలుకల నివారణపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-ఘంటసాల: సామూహిక ఎలుకల నివారణపై రైతులు అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ శాఖాధికారి కె.మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం ఘంటసాల మండలం కొడాలి రైతు సేవా కేంద్రం నందు సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు 100 శాతం రాయితీపై బ్రోమోడయోలిన్ ఎలుక నివారణ మందును అందజేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మండలంలోని 13 రైతు సేవా కేంద్రాల పరిధిలో సాగు చేయబడిన 19000 ఎకరాలకు అదనంగా మరొక 10 శాతం విస్తీర్ణంకు కలుపుకుని దాదాపు 21000 ఎకరాలకు ఈ బ్రోమోడయోలిన్ మందును అందించటానికి ఏర్పాట్లు చేయటం జరిగిందన్నారు. రైతులు సామూహికంగా శాస్త్రీయ పద్ధతిలో నిర్మూలన పద్ధతులు అవలంబించటం ద్వారా పంటను ఎలుకల బారి నుంచి కాపాడుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు తుమ్మల చౌదరిబాబు, మొవ్వ ఏడిఏ ఎస్.శ్యామల, కొడాలి ఉపసర్పంచ్ తుమ్మల శంకరరావు, రైతులు యార్లగడ్డ వీరభద్రరావు విఏఏ వి.వెంకటలక్ష్మి, ఎం.వై ఆలీ తదితర రైతులు పాల్గొన్నారు.

నిధుల్లేవు... లైట్లు వెలగవు..!

దుర్భరస్థితిలో పంచాయతీలు

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీల్లో వీధి దీపాల నిర్వహణ దయనీయంగా మారింది. గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, విజయవాడ రూరల్ మండలాల్లో 84 పంచాయితీలు ఉన్నాయి. అందులో 20 మేజర్ పంచాయతీలున్నాయి. మిగిలినవన్నీ మైనర్ పంచాయతీలే. మేజర్ పంచాయతీల్లో ఆర్థిక పరిస్థితి బాగున్న మైనర్ పంచాయతీల్లో డబ్బులు లేని పరిస్థితి నెలకొంది. విద్యుత్తు ఆదాతో పాటు పంచాయతీలపై నిర్వహణ భారం తగ్గించేందుకు గతంలోనే స్తంభాలకు ఎస్ఈడీ దీపాలు బిగించారు. నిర్వహణ బాధ్యతలను ఇంధన సామర్థ్య సేవల సంస్థకు అప్పగించారు. ఎస్ఈడీ దీపాల వినియోగం ద్వారా ఆదా అయిన సొమ్ము వాయిదాల రూపంలో లైట్లు సరఫరా చేసే సంస్థకు చెల్లిస్తేసరిపోతుందని అధికారులు అప్పట్లో చెప్పారు. కొంతకాలం పాటు సక్రమంగా నిర్వహించినా.. ఆ తర్వాత చేతులెత్తేశారు. దీంతో ఇవి ఎక్కడికక్కడ మూలనపడ్డాయి. వీటి స్థానంలో తిరిగి చిన్న బల్బుల కొనుగోలు చేశారు. గతంలో వాడిన ఎల్ఈడీ దీపాలకు చేసిన ఖర్చును ప్రస్తుతం పంచాయతీల నుంచి వైసిపి ప్రభుత్వం తీసుకుంది. ఐదేళ్లుగా ఒక్క రూపాయి ఇచ్చింది లేదు.. ముఖ్యమంత్రిగా జగన్ అధికార పీఠం ఎక్కిన తరువాత గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా ఇచ్చింది లేదు. రెండేళ్లుగా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 14, 15వ ఆర్థిక సంఘం నిధులను కూడా సర్పంచులు, అధికారులకు కూడా తెలియకుండా దారి మళ్లించింది. దీంతో గ్రామాల్లో ఎక్కడా కనీస అభివృద్ధి అనేది లేకుండాపోయింది. వీటిలో అధిక భాగం విద్యుత్తు ఛార్జీల రూపంలో తిరిగి రాష్ట్ర ప్రభుత్వం తన ఖజానాకు జమ చేసుకుంది. మిగిలిన వాటిలో కూడా ఎల్ఈడీ దీపాల నిర్వహణ పేరుతో మరికొంత తీసేసుకుంది. దీంతో గ్రామాల్లో కనీస వసతులు కల్పించలేకపోతున్నామని సర్పంచులు వాపోతున్నారు. గ్రామ పంచాయతీలపై వీధి దీపాల నిర్వహణ, విద్యుత్తు బిల్లుల భారం తగ్గించాలనే ఉద్దేశంతో గత తెదేపా ప్రభుత్వం 2019లో రాష్ట్రవ్యాప్తంగా వీధి దీపాలుగా ఎస్ఈడీ బల్బులు ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ చాలా చౌకగా ఉండటం, విద్యుత్తు వినియోగం కూడా పెద్దగా ఉండకపోవడంతో వీటిని వినియోగిస్తే ప్రజాధనం ఆదా అవుతుందని వీటిని ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ బాధ్యతను ఈసీఎల్ కార్పొరేషన్, నెడ్క్యాప్ సంస్థలకు అప్పగించారు. 2019 తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వీరికి నిర్వహణ నిధులు సక్రమంగా ఇవ్వకపోవడంతో వీరు 2020లో తమ వల్ల కాదని చేతులెత్తేశారు. ఇప్పటి వరకు వైసిపి గ్రామాల్లో ఒక్క ఎద్దుడీ బలలుకు కూడా మరమ్మతులు తమ వల్ల కాదని చేతులెత్తేశారు. ఇప్పటి వరకు వైకాపా గ్రామాల్లో ఒక్క ఎస్ఈడీ బల్బుకు కూడా మరమ్మతులు నిర్వహించిన దాఖలాలు లేవు. దీంతో అనేక గ్రామాల్లో చీకట్లు అలముకున్నాయి. ప్రజల బాధలు చూడలేని కొందరు సర్పంచులు సాధారణ నిధులు నుంచి స్తంభాలకు సాధారణ విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశారు.

2021 ఏప్రిల్లో పంచాయతీల్లో కొత్త పాలక వర్గాలు కొలువుదీరాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రామాల అభివృద్ధికి పంచాయతీ ఖాతాలకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయనేలేదు. ప్రభుత్వం ఎల్ఈడీ లైట్ల నిర్వహణ గాలికొదిలేయడంతో ప్రస్తుతం నియోజకవర్గంలో 40 శాతానికిపైగా వెలగడం లేదు. కనీస మరమ్మతులు కూడా చేయించే పరిస్థితి లేదు. వెలగని దీపాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేవారు కూడా కరవయ్యారు. ఆర్థిక సంఘం నిధులు రాష్ట్ర ప్రభుత్వం వాడేసుకోవడంతో సర్పంచులుసైతం వీధి దీపాలు నిర్వహించలేని స్థితికి చేరుకున్నారు. విధిలేని పరిస్థితుల్లో ఎస్ఈడీ దీపాలు వెలగని కొన్నిచోట్ల చిన్న బల్బులు ఏర్పాటు చేశారు. వీటి నుంచి సరిపడా వెలుతురు రాక గ్రామీణులు ఇబ్బందులు పడుతున్నారు.

శాంసంగ్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): తమిళనాడులోని పెరుంబుదూరు శాంసంగ్ ప్లాంట్లో పనిచేస్తున్న ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా నాయకులు టి.చంద్రపాల్ డిమాండ్ చేశారు. పెరుంబుదూరు శాంసంగ్ ప్లాంట్లో సిఐటియు యూనియన్ ఏర్పాటు చేయడం వల్ల యాజమాన్యం తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఈ నెల 9వ తేదీ నుండి చేస్తున్న నిరవధిక సమ్మెకు మద్దతుగా మంగళవారం సిఐటియు మచిలీపట్నం మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక శాంసంగ్ షోరూం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రపాల్ మాట్లాడుతూ తమిళనాడులోని శ్రీపెరంబుదూరులో 1400 నుండి 1810 మంది కార్మికులు శాంసంగ్ ప్లాంట్లో పని చేస్తున్నారన్నారు. కార్మిక చట్టాలు, కనీస వేతనాలు అమలు గాని పరిస్థితి, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా సిఐటియు యూనియన్ ఏర్పాటు చేసుకున్న సందర్భంలో యాజమాన్యం 1810 మందిని బెర్నిటేట్ చేయటం జరిగిందన్నారు. యూనియన్ నాయకత్వంతో యాజమాన్యం చర్చలు జరిపి కార్మికులను విధుల్లోకి తీసుకుని కనీస వేతనాలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం కేంద్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్లుగా తీసుకురావడం వల్ల కార్మికులను యాజమాన్యాలకి కట్టుబానిసలుగా మారుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక కోడ్స్ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి బూర సుబ్రహ్మణ్యం, కృష్ణాజిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కెవి గోపాల్రావు, మండల కార్యదర్శి చిరువోలు జయరావు, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎండి యునాస్, ఆనంద బెనర్జీ, ఎల్ఐసి రిటైర్డ్ యూనియన్ నాయకులు పి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

డిఎస్సి శిక్షణా సంస్థల నుండి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సాంఘిక మరియు గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 5050 మంది ఎస్సి, ఎస్టి విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో డిఎస్సీ శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించడం జరిగిందని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ షాహిద్బాబు షేక్ తెలిపారు. ఈ డిఎస్సి శిక్షణను రాష్ట్ర వ్యాప్తముగా ఎంపిక చేయబడిన శిక్షణ సంస్థలు, రాష్ట్రంలోని సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఉన్న స్టడీ సర్కిల్స్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం ఆసక్తి గల శిక్షణా సంస్థల నుండి దరఖాస్తులను కోరుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఆసక్తి గల శిక్షణ సంస్థలు ఈ నెల 21వ తేదీలోపు ఆంధ్రప్రదేశ్ ఈ-ప్రొక్యూర్మెంట్ పోర్టల్లో దరఖాస్తు చేసుకోవాలని, మరింత సమాచారానికి http://tender.apeprocurement.gov.in వెబ్సైట్ను చూడాలని తెలిపారు.

14 నుంచి పల్లె పండుగ : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): 'పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలు' కార్యక్రమం కింద జిల్లాలో ఈ నెల 14 నుండి 20 వరకు గ్రామాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు సూచించారు. 'పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలు' కార్యక్రమం నిర్వహణపై ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అమరావతి సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్లో అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఉపాధి హామీ చట్టం కింద జిల్లాలో 168 కోట్లతో 2331 పనులు మంజూరు చేసినట్లు, మంజూరైన పనులన్నీ పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా ఈ నెల 14వ తేదీ నుండి గ్రామాల్లో శంకుస్థాపనలు చేయడానికి షెడ్యూల్ రూపొందించడం జరుగుతుందన్నారు. చేపట్టిన పనులన్నీ వచ్చే సంక్రాంతి నాటికి పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయడం జరుగుతుందని ఉప ముఖ్యమంత్రి వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమం జిల్లాలో విజయవంతం చేయడానికి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేయాలని, షెడ్యూల్ రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పి సీఈవో కె.కన్నమ నాయుడు, డ్వామా పీడీ ఎన్.వి.శివప్రసాద్, పంచాయతీరాజ్ ఎస్ఇ రమణారావు, డిపిఓ జె అరుణ, హౌసింగ్ పీడీ ఎస్.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి పెట్టాలి : వెనిగండ్ల

ప్రజాశక్తి-గుడివాడ: అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి పెట్టాలని, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణపై ఆటంకాలు ఎదురైతే తన దృష్టికి తేవాలని అధికారులకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచించారు. మంగళవారం స్థానిక ప్రజావేదికలో మండల పరిషత్, ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో ఎమ్మెల్యే రాము సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవాంతరాలు లేకుండా వేగవంతంగా అభివృద్ధి పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల వారీగా అభివృద్ధి పనుల అంచనాలను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలన్నారు. ఈ నెల 14 నుండి ప్రారంభం కానున్న పల్లె పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని గుడివాడ రూరల్, గుడ్లవల్లేరు, నందివాడ మండలాల్లో అభివృద్ధి పనులు అధికారులు ఎమ్మెల్యే వెనిగండ్ల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, ఎంపిడిఓలు బి.వై విష్ణు ప్రసాద్, మల్లీశ్వరి, గుడ్లవల్లేరు మండల ఇవోపిఆర్డి సారథి, ఏ.వో ఇమ్రాన్, పంచాయితీరాజ్ ఎఇ సూరిబాబు, ఉపాధి హామీ ఇంజనీరింగ్ కన్సల్టెంట్ రామకృష్ణ, ఆర్డబ్ల్యూఎస్ ఎ.ఇ అట్లూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల అభివృద్ధికి చర్యలు : మండలి

ప్రజాశక్తి-చల్లపల్లి: చల్లపల్లిలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిని యాభై పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తామని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మంగళవారం చల్లపల్లిలోని కస్తూరిబా మెమోరియల్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో బుద్ధప్రసాద్ అధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అభివృద్ధి పనులపై డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రావణ్ కుమార్, ఏపీఎంఐడీసీ ఈఈ నాగార్జునరావులతో చర్చించారు. ఇంచార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్ శ్రీనివాసరావు ఆసుపత్రి అవసరాలు వివరించారు. ఆక్సీజన్ సరఫరా వ్యవస్థ క్రమబద్ధీకరించి, లాక్ సిస్టం ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులు, గైనకాలజిస్ట్ పోస్టు భర్తీ, యాభై పడకల ఆసుపత్రిగా ప్రమోట్ చేసేందుకు అనువైన అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ పేదలకు ఉత్తమ సేవలు అందిస్తూ ప్రజల నుంచి మంచి పేరు పొందుతున్న చల్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు అభివృద్ధి నిధులు, సీఎస్ఆర్ నిధులు, దాతల సహకారంతో కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఎంపీడీఓ డాక్టర్ అనగాని వెంకటరమణ, పంచాయతీ ఈఓ పీవీ మాధవేంద్రరావు, ఎస్ఐ పి.సుబ్రహ్మణ్యం, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు వరదా హరిగోపాల్, తోట కనకదుర్గ, సొంతల కృష్ణవేణి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్యేను, తమ అధికారులను, నూతన కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించారు.

అవనిగడ్డ: అవనిగడ్డ ప్రభుత్వ ఏరియా వైద్యశాల అభివృద్ధికి కృషి చేస్తానని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ స్పష్టం చేశారు. మంగళవారం అవనిగడ్డలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ వైద్యులు సిబ్బంది రోగులతో మాట్లాడి ఆసుపత్రికి కావలసిన అవసరాలు తెలుసుకున్నారు ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ ఎమ్మెస్ సర్జన్ పోస్టులు భర్తీ చేస్తామన్నారు ఆసుపత్రిలో ప్రసవాలు సంఖ్య పెరగాలని సూచించారు . ఆక్సిజన్ ప్లాంట్ వినియోగంలోకి తేవాలని చిన్న చిన్న కొట్లాట కేసులు కూడా ఎక్స్రే తీయకుండా మచిలీపట్నం రిఫర్ చేస్తున్నారని కమిటీ సభ్యులు కొల్లూరి వెంకటేశ్వరరావు ప్రస్తావించగా ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా చూడాలని ఎమ్మెల్యే వైద్యులకు సూచించారు. ఆసుపత్రి అభివృద్ధి సౌకర్యాల కల్పన రోగులకు సిబ్బందికి సౌకర్యాల కల్పనకు తగిన ఏజెండాపై సమావేశంలో చర్చించి ఆమోదించారు. ఈ సమావేశంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ శ్రావణ్ కుమార్, ఏపీ ఎంఐడిసి ఈఈ కే నాగేశ్వరరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయ కుమార్, ఎంపీడీవో మర్యాద దేవి, పంచాయతీ ఇంచార్జ్ ఈవో అనిత, ఆసుపత్రి కమిటీ సభ్యులు కొల్లూరి వెంకటేశ్వరరావు, తుంగల వెంకటగిరి, బచ్చు కృష్ణకుమారి పాల్గొన్నారు.

చల్లపల్లిలో మాట్లాడుతున్న మండలి బుద్ధప్రసాద్

చర్చి వార్షికోత్సవం

ప్రజాశక్తి-చల్లపల్లి: మండల పరిధిలోని పురిటిగడ్డ గ్రామంలో సిఎస్ఐ చర్చి 9వ వార్షికోత్సవ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్బాబు, దైవ సేవకులు కాలి ప్రవీణ్ కుమార్, కలపాల మెర్సీ జయంతి, కాకి సుకన్య, పల్లెకొండ సుధాకర్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

12న తెప్పోత్సవానికి హంస వాహనం సిద్ధం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దుర్గమ్మ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో దసరా ఉత్సవాల ముగింపులో భాగంగా ఈనెల 12వ తేదీ విజయదశమిని పురస్కరించుకుని ప్రతి యేడు జరిగేలా దుర్గాఘాట్ వద్ద కృష్ణానదిలో అమ్మవారి హంస వాహన తెప్పోత్సవం కన్నుల పండుగగా జరగనుంది. ఈ నేపథ్యంలో దుర్గాఘాట్ వద్ద హంస వాహనాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇంద్రకీలాద్రి అధిష్టాన దేవత శ్రీ కనకదుర్గా దేవికి కృష్ణానదిలో నిర్వహించే హంస వాహన సేవ కనుల పండువుగా తిలకిండానికి లక్షలాదిమంది యాత్రికులు తరలివస్తారు. ఈ జల విహారాన్ని చూడముచ్చటైన వేడుకగా భక్తిశ్రద్ధలతో నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. తెప్పోత్సవంగా పిలిచే వాంస వాహన సేవలో త్రిలోక సంచారానికి గుర్తుగా శ్రీ గంగా పార్వతి (దుర్గ) సమేత శ్రీ మల్లేశ్వర స్వామి వార్లను మూడుసార్లుగా ప్రదక్షణలలో జలవిహారం చేయిస్తారు. దసరా పండుగ విజయదశమి రోజున సాయం సంధ్యావేళ కృష్ణానది వద్ద ఆహ్లాద వాతావరణంలో నిర్వహించే ఈ తెప్పోత్సవం వీక్షించేందుకు నగర వాసులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వేలాదిగా తరలివస్తారు.

టికెట్ల ద్వారా ఆదాయం రూ.57,18,706

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా ఉత్సవాల సందర్భంగా ఆరో రోజు మంగళవారం దర్శనం టిక్కెట్లు, ప్రసాదాల అమ్మకం, కుంకుమ పూజలకు సంబంధించి మంగళవారం సాయంత్రం 5 గంటల వరకూ దేవాలయానికి మొత్తం రూ.57,18,706 లు ఆదాయం లభించింది. రూ. 500 టిక్కెట్లు 4827 కు రూ. 24,13,500లు, రూ.300ల టిక్కెట్లు 2037కు రూ. 6,11,100లు, రూ.100ల టిక్కెట్లు 4698 కు రూ. 4,69,800లు, లడ్డూ ప్రసాదం ఒకటి రూ.15ల చొప్పున 24918 లడ్డూలకు రూ.3,73,770లు, ఆరు లడ్డూల ప్రసాదం ప్యాక్ రూ.100ల చొప్పున 95490 లడ్డూలకు రూ.15,91,500లు, పరోక్ష ప్రత్యేక కుంకుమార్చనకు రూ.3వేల చొప్పున 16 టిక్కెట్లకు రూ,48వేలు కుంకుమార్చన (సరస్వతి అలంకరణ) రూ.5వేలు చొప్పున 5 టిక్కెట్లకు రూ.25వేలు పరోక్ష ప్రత్యేక చండీహోమం రూ. 4వేలు చొప్పున 8 టిక్కెట్లకు గానూ రూ. 32వేలు పరోక్ష ప్రత్యేక శ్రీచక్ర నవార్చన రూ. 3వేలు చొప్పున 0 టిక్కెట్లు రూ. 0, పరోక్ష ప్రత్యేక ఖడ్గమాలార్చన రూ.5,116లు చొప్పున ఒక టిక్కెట్‌కు రూ.5,116, ఫొటోలు, క్యాలెండర్స్‌కు రూ.4,112లు, హుండీ, డొనేషన్ల రూపంలో రూ. 78,608లు, కేశఖండన టిక్కెట్ రూ. 40ల చొప్పున 1655 టిక్కెట్లకు గాను రూ.66,200లు ఆదాయం సమకూరింది. దీంతో మొత్తం రూ. 57,18,706లు ఆదాయం సమకూరినట్లు దుర్గగుడి అధికారులు మంగళవారం విడుదల చేసిన ప్రకటన ద్వారా తెలిపారు.

దుర్గమ్మను దర్శించుకున్న పట్టాభి

ప్రజాశక్తి, వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఆరవ రోజు మంగళవారం శ్రీ మహాలక్ష్మీ దేవి అలంకారంలో దుర్గమ్మ దర్శనమిచ్చింది. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పట్టాభి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఇఓ కెఎస్ రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

రూ.50వేలతో అలంకరణ

ప్రజాశక్తి - కంచికచర్ల : దశర నవరాత్రులలో భాగంగా కంచికచర్ల మండల పరిధిలోని పరిటాల గ్రామంలో స్థానిక కొత్తురు సెంట ర్‌లో ఏర్పాటు మండ పంలలో మంగళవారం ఆరవ రోజు మహాలక్ష్మి అమ్మవారిని రెండు లక్షల యాభై వేల రూపాయలతో అలంకరించారు. స్తానిక వసంత కాలనీలో అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. మహాలక్షమీ దేవాలయం, కన్యకాపరమేశ్వరీ ఆలయంలో దేవతా విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. రాత్రి మహిళలు బతుకమ్మ ఆటలు నిర్వహించారు.

శ్రీ మహాలక్ష్మీ దేవిగా దుర్గమ్మ దర్శనం

తరలి వచ్చిన సందర్శకులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు మంగళవారం ఆశ్వయుజ శుద్ధ పంచమి నాడు ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత కనకదుర్గమ్మ శ్రీ మహాలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చింది. దుర్గమ్మను దర్శించుకునేందుకు యాత్రికులు తరలివచ్చారు.

మహాలక్ష్మి అవతారాన్ని దర్శించుకున్న డీజీపీ ద్వారకా తిరుమలరావు, మంత్రి అనగాని సత్యప్రసాద్

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ మంగళవారం మహాలక్ష్మి రూపంలో దర్శనం ఇచ్చారు. డీజీపీ ద్వారకాతిరుమలరావు సతీసమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన మాట్లాడుతూ సామాన్య యాత్రికులకు సులభతర దర్శనమే లక్ష్యంగా పోలీసు శాఖ పనిచేస్తుందన్నారు. విఐపి దర్శనాల కోసం వస్తున్న యాత్రికులకు వారికి కేటాయించిన సమయంలోనే దర్శనం చేసుకోవాలని సూచించారు. మూల నక్షత్రం సందర్భంగా యాత్రికుల రద్దీ పెరుగుతుందని, అటువంటి సందర్భాలలో పోలీసులు సహనంతో బాధ్యత నిర్వహించాలని అన్నారు. మూలా నక్షత్రం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు.

నేడు శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో దుర్గమ్మ

ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా ఉత్సవాలలో భాగంగా ఏడవ రోజు ఆశ్వయుజ శుద్ధ షష్టి / సప్తమి బుధవారం శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో దుర్గమ్మ దర్శనం ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా బుధవారం శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో దుర్గమ్మను లక్షలాది యాత్రికులు అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో తరలివస్తారని అధికారులు తెలిపారు.

రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ సతీసమేతంగా దర్శించుకున్నారు. అనంతరం ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనాలు, అమ్మవారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తున్న భక్తులకు క్యూ లైన్‌లో అందిస్తున్న సౌకర్యాలపై అధికారులను మంత్రి అనగాని సత్య ప్రసాద్ అడిగి తెలుసు కున్నారు.

దుర్గమ్మకు కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం సారె సమర్పణ

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్న ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో కొలువైయున్న జగన్మాతకు రాష్ట్రంలోని వివిధ దేవాలయాల నుంచి సారె సమర్పించడం సాంప్రదాయంగా వస్తోంది. ఇందులో భాగంగా చిత్తూరు జిల్లాలోని కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం తరపున ప్రత్యేక బందం మంగళవారం శ్రీ మహాలక్ష్మి దేవి అలంకత అమ్మవారికి పట్టు వస్త్రాలు, సారె సమర్పించారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన అనంతరం పూతలపట్టు శాసనసభ్యులు డా. కె.మురళీమోహన్ ఇంద్రకీలాద్రి మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ దుర్గా శరన్నవరాత్రుల సందర్భంగా ఏటా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించడం జరుగుతోందని, ఈ ఏడాది జగన్మాతకు పట్టు వస్త్రాలు సమర్పించే అవకాశం రావడం పూర్వజన్మ సుకతంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

శ్రీసంతోషిమాత దేవిగా దర్శనమిచ్చిన చిట్టినగర్ అమ్మవారు

స్థానిక చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న దసరా మహోత్సవంలో భాగంగా మంగళవారం అమ్మవారు శ్రీ

చిట్టినగర్ దేవస్థానంలో శ్రీ సంతోషిమాత దేవిని దర్శించుకుంటున్న యాత్రికులు

సంతోషిమాత దేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. కాగా ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి శ్రీ సంతోషిమాత దేవి అలంకారంతో దర్శనమిచ్చిన శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని పూజాదికాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మీ అమ్మవార్ల దేవస్థానం కమిటీ అధ్యక్షులు లింగిపిల్లి అప్పారావు, కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, గౌరవాధ్యక్షులు బెవర సూర్యనారాయణ మాట్లాడుతూ దసరా మహోత్సవాల సందర్భంగా ప్రతినిత్యం వేలాది మంది భక్తులు ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుంటున్నారని చెప్పారు. ప్రతిరోజు సాయంత్రం వేళల్లో నిర్వహిస్తున్న సాంస్కతిక కార్యక్రమాలు కార్యక్రమాలకు భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. సాంస్కతిక కార్యక్రమాల్లో పాల్గొన్న వారికి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ ఉపాధ్యక్షులు బెవర శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులు పొట్నూరి దుర్గాప్రసాద్ (రాజా), శీరం వెంకట్రావు, కార్యవర్గ సభ్యులు పోతిన బేసికంటేశ్వరుడు, మజ్జి ఈశ్వరరావు, తొత్తడి భరత్ కుమార్, పోతిన సాంబశివరావు, భోగవల్లి శ్రీధర్, ముదిలి గణేష్, బంక హనుమంతరావు, ఈది ఎల్లా రాజారావు, పిళ్లా విజయ్ కుమార్, మజ్జి శ్రీనివాసరావు పోతిన వెంకట ధర్మారావు, గూడేల రామకష్ణ, కామందుల నరసింహారావు, తమ్మిన సూర్యకుమారి, పనుకు రమ,తదితరులు పాల్గొన్నారు.

నేడు దుర్గమ్మకు సిఎం పట్టువస్త్రాలు సమర్పణ

మూలా నక్షత్రం సందర్భంగా అందరికీ సర్వదర్శనమే
విఐపి, వివిఐపి, అంతరాలయ దర్శనాలు బంద్
దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

మాట్లాడుతున్న ఆనం రామనారాయణరెడ్డి

ప్రజాశక్తి - వన్‌టౌన్, విజయవాడ అర్బన్, విజయవాడ : ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున మూలా నక్షత్రం తిథి సందర్భంగా ఏడో రోజు బుధవారం రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీ సమేతంగా పట్టు వస్త్రాలు సమర్పించనున్నారని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చెప్పారు. ఇంద్రకీలాద్రి దిగువున ఉన్న మోడల్ గెస్ట్ హౌస్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో దసరా ఉత్సవాల నిర్వహణ ప్రత్యేక అధికారి రామచంద్రమోహన్, దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ డా. జి.సృజన, నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు, దుర్గగుడి ఈవో కె.ఎస్.రామారావులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ శరన్నవరాత్రి ఉత్సవాలలో అత్యంత కీలకమైన అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రం పర్వదినాన బుధవారం శ్రీ సరస్వతీదేవి అంకారంలో దుర్గమ్మ భక్తులకు దర్శనమివ్వనున్నారన్నారు. బుధవారం తెల్లవారుజామున మూడు గంటల నుంచి దర్శనాలు ప్రారంభమవుతాయన్నారు. మధ్యాహ్నం 2–3 గంటల మధ్య ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీసమేతంగా ఇంద్రకీలాద్రికి చేరుకుని రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రాక సందర్భంగా నగరంలో కొన్ని ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు తెలిపారు. డైనమిక్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్ ద్వారా సమయానుకూలంగా ఈ ఆంక్షలు ఉంటాయన్నారు. కనకదుర్గా ఫ్లైవోవర్‌పై ఎటువంటి ఆంక్షలు లేవని వివరించారు. కాళేశ్వరరావు మార్కెట్ వద్ద ఉన్న ఫ్లైవోవర్‌పై రాకపోకలు పూర్తిగా నిషేధిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే 4500 మంది పోలీసులు శరన్నవరాత్రి ఉత్సవాలలో విధులు నిర్వహిస్తుండగా మరొక 1100 మంది పోలీసులు 110 హోల్డింగ్ టీమ్‌లుగా విధులు నిర్వహిస్తారని తెలిపారు.

అనధికార ఫ్లెక్సీలు, బోర్డులు తొలగించాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణ పరిశుభ్రత, సౌందర్యాన్ని కాపాడే ప్రయత్నంలో అన్ని అనధికార ఫ్లెక్స్ బోర్డులు పోస్టర్లు తొలగింపునకు శ్రీకారం చుట్టామని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. ఈ నెల 13వ తారీకు లోపు మునిసిపల్ పరిమితుల్లో ఏదైనా అనధికార ఫ్లెక్స్ బోర్డులు, బ్యానర్లు లేదా హోర్డింగ్‌లను స్వచ్ఛందంగా తొలగించాలని, ఏర్పాటు చేసిన వారు తొలగించకుంటే వాటిని తొలగించేందుకు 14వ తేదీ నుండి మున్సిపాలిటీ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ డిజిటల్ యుగంలో సోషల్ మీడియా అనేది ప్రచారానికి అత్యంత ప్రభావవంతమైన, విస్తృతంగా ఉపయోగించే వేదిక అన్నారు. గోడలపై ఎలాంటి బ్యానర్లు, పోస్టర్లు అతికించకూడదని కోరారు. మున్సిపల్ మినిస్టర్ నారాయణ ఆదేశానుసారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మొత్తం కూడా పోస్టర్ ఫ్రీగా ఉండాలని, మంచి ఉద్దేశంతో ఇలా చేస్తున్నామని ఏ రాజకీయ పార్టీ వారైనా సరే ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే 48 గంటల్లో వారికి వారే తొలగించాలని దాదాపు పోస్టర్లు అన్నీ కూడా సోషల్ మీడియాలో మాత్రమే కనిపించే విధంగా రాజకీయ పార్టీ నాయకులందరూ చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. వ్యాపార సముదాయాల వారు కూడా పోస్టర్లు సోషల్ మీడియా వరకే పరిమితం చేయాలన్నారు.

తూర్పు బైపాస్ నిర్మాణానికి ఆటంకాల్లేకుండా చూడండి

అధికారులకు కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ ఆదేశం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): జిల్లాలో నూతనంగా నిర్మించనున్న నాలుగు వరుసల తూర్పు బైపాస్ రహదారి వల్ల ఎవరికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ డికె బాలాజీ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశ మందిరంలో ఎన్‌హెచ్ఎఐ ప్రాజెక్టు డైరెక్టర్ ఆధ్వర్యంలో చైతన్య ప్రాజెక్ట్ కన్సల్టెంట్ మురళి నూతనంగా నిర్మించనున్న తూర్పు బైపాస్ రహదారి సమగ్ర ప్రాజెక్టు నివేదికను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తొలుత ఎన్‌హెచ్ఎఐ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ విజయవాడ నగరంలో రద్దీ పెరుగుతున్న దృష్ట్యా ఆ పరిస్థితులను నివారించడానికి కొత్తగా నాలుగు వరుసల తూర్పు బైపాస్ గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణానికి రూపకల్పన జరిగిందన్నారు. కృష్ణాజిల్లాలోని ఎన్‌హెచ్ 16 ఉంగుటూరు మండలం పొట్టిపాడు నుండి ప్రారంభమై గుంటూరు జిల్లా చిన్న కాకానిలోని ఖాజ గ్రామం వరకు 44 కిలోమీటర్ల రహదారి నిర్మించాల్సి ఉంటుందన్నారు. ఇందులో కృష్ణాజిల్లాలో 26 కిలోమీటర్లు ఉండగా గుంటూరు జిల్లాలో 18 కిలోమీటర్ల రహదారి ఉంటుందన్నారు. ఈ రహదారి నిర్మాణానికి 2024-25 వార్షిక ప్రణాళికలో 2,716 కోట్ల రూపాయలను హైవే పనుల కింద కేటాయించడం జరిగిందన్నారు. వచ్చే సంవత్సరం మార్చిలోగా భూసేకరణ పూర్తి చేసుకుని టెండర్ల పనులు పూర్తిచేసుకుని రహదారి నిర్మాణం పనులు ప్రారంభించాల్సి ఉంటుందన్నారు. కన్సల్టెంట్ మురళి మాట్లాడుతూ బైపాస్ రహదారి నిర్మాణానికి మూడు ప్రతిపాదనలు సిద్ధం చేశామని అందులో రెండవ ప్రతిపాదన అన్ని విధాలా అనుకూలంగా ఉందన్నారు. ఆ ప్రతిపాదన ప్రకారం రహదారి నిర్మాణం వల్ల విమానాశ్రయానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని, మచిలీపట్నం ఓడరేవుకు దగ్గరగా అనుసంధానమై ఉంటుందని, అలైన్మెంట్ దారిలో వచ్చే భూములు తక్కువ ధరకే భూసేకరణకు లభిస్తాయని, ఎనిమిది పెద్ద వంతెనలు నిర్మించాల్సి ఉంటుందని, అందులో కృష్ణానది దాటేందుకు 3.35 కిలోమీటర్ల పెద్ద వంతెన నిర్మించాల్సి ఉంటుందని చెప్పారు. రహదారి నిర్మాణానికి 291 ఎకరాలు భూసేకరణ కింద తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ రహదారి నిర్మాణానికి తాత్కాలిక అంచనాల ప్రకారం భూసేకరణ ఇతరత్రా కలుపుకొని 4596.29 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని వివరించారు. ఈ సమావేశంలో పెనమలూరు శాసనసభ్యులు బోడే ప్రసాద్, సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, డిఆర్ఓ కె.చంద్రశేఖర రావు, గుడివాడ, ఉయ్యూరు ఆర్‌డిఒలు బాలసుబ్రమణ్యం, డి సంపత్ హేళ షారూన్, ఆర్అండ్‌బి ఈఈ లోకేష్, జిల్లా ఉద్యాన అధికారి జ్యోతి, సర్వే భూ రికార్డుల ఏడి జోషిలా, సిపిడిసిఎల్ ఎస్ఇ సత్యానందం పాల్గొన్నారు.

పొలాల్లో ఎలుకల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-గూడూరు: విత్తనం వేసిన మొదలు ధాన్యం అమ్మే వరకు ఎలుకలు వరి పైరుకు, ధాన్యానికి నష్టం కలిగిస్తాయని గూడూరు మండల వ్యవసాయాధికారి జి.వి.శివప్రసాద్ అన్నారు. మంగళవారం గూడూరులో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రోమోడియోలెన్ మందు 8 నుండి 10 గ్రాములు ఒక హెక్టారుకు ఉపయోగయోగించాలని, దీనికి ఒకరోజు ముందు మందుకలపని ఎరను ఎలుక ఉన్న బొరియను గుర్తించి అక్కడ ఉంచాలన్నారు. ఎలుక దానిని తీసుకొని లోపలికి వెళ్లి ముందు అది తిని ఏమీ కాలేదని నిర్ధారించుకుని దాని పిల్లలకు కూడా పెడుతుందన్నారు. మందు కలిపిన ఎరను రెండో రోజు మళ్లీ బొరియల దగ్గర ఉంచితే అదే విధంగా అన్నీ తినేస్తాయన్నారు. బజారులో దొరికే జింక్ ఫోస్పిడే లాగా ఈ మందు తింటే ఎలుక వెంటనే చనిపోదని, మెల్లగా క్షీణించి ఎక్కడో ఒక చోట చనిపోతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు వేమూరి శైలజ, బేటాలం కృష్ణారావు, జడ రామారావు, ఉంగరల పీర్లస్వామి, వివిఎలు ప్రభాకర్, ఈశ్వర్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

'మత్తు'తో జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

ప్రజాశక్తి-ఉంగుటూరు: మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాన్ని కోల్పోతారని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు అన్నారు. మంగళవారం మండలంలోని ఆత్కూరు పిహెచ్‌సిలో ఆశ, ఆరోగ్య కార్యకర్తలకు మత్తు పదార్థాల వల్ల జరిగే నష్టంపై జరిగిన సమావేశంలో శేఖర్‌బాబు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలను అలవాటు చేసుకొని చివరకు మత్తు పదార్థాలు లేకుండా ఉండలేని పరిస్థితికి వస్తున్నారన్నారు. మత్తు మైకంలో చదువుకు దూరమవుతూ విలువైన శక్తిని నిర్వీర్యం చేసుకుంటున్నారిన చెప్పారు. మాదక ద్రవ్యాలకు బానిసలైన వారి భావోద్వేగ స్థితుల్లో ప్రతికూలమైన మార్పుకు దారి తీస్తుందని, మెదడుపై తీవ్ర ప్రభావం వల్ల శారీరకంగానూ, మానసికంగాను ఇబ్బంది పడుతున్న వారి కోసం సైకియాట్రిస్ట్, సైకాలజిస్టుల అనుభవం కలిగిన నిపుణులతో నీతోడు మానసిక వికాస కేంద్రాన్ని ఉచితంగా నిర్వహిస్తున్నామని, ఇందుకోసం 9490492020 ఫోన్ నెంబర్‌కు సంప్రదించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆత్కూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ టి.జితేంద్రకుమార్, సాంబశివరావు, నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ విజయ రాణి పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్లు... ప్రజలకు ఇక్కట్లు

రోడ్డును కమ్మేసిన దుమ్ము

ప్రజాశక్తి-కోడూరు: కోడూరు మండలంలో పలు రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 2016లో పుష్కరాల సమయంలో కోడూరు నుండి అవనిగడ్డ వరకు రోడ్డును నూతనంగా నిర్మించారు. ఆ రోడ్డు నిర్మాణం చేపట్టిన కొన్ని నెలలకే ధ్వంసం అవ్వడంతో అప్పటినుంచి కోడూరు మండల ప్రజలు మాత్రమే కాక ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన హంసలదీవి సాగర తీరానికి వచ్చే భక్తులు, పర్యాటకులు ఆ రోడ్ల మీద ప్రయాణించలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గర్భిణీ స్త్రీలను, ఎమర్జెన్సీగా వైద్యం కోసం హాస్పిటల్‌కి వెళ్లే రోగులు సైతం రోగం బాధ కంటే, రోడ్ల గుంతలు బాధలు ఎక్కువయ్యాయని అంటున్నారు. ఎన్నికల సమయంలో ప్రారంభించిన రోడ్డు ఇంకా పనులు సాగుతూనే ఉన్నాయి. ఇంకా ఎంత కాలం సాగుతాయి, నా బ్రతుకులు ఇంతేనా అని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కోడూరు నుంచి అవనిగడ్డకు వెళుతుంటే ద్విచక్ర వాహనదారులపై దుమ్ము, పొగ మంచులా వ్యాపించి మొత్తం కమ్మేస్తుంది. కోడూరు మండలం నుంచి నాగాయలంక మండలానికి వెళ్లాలన్న, అవనిగడ్డ మండలానికి వెళ్లాలన్న, మచిలీపట్నం మండలం వెళ్ళాలన్నా ఒక రోడ్డు పరిస్థితి కూడా మెరుగ్గా లేకపోవడంతో ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే పొరుగు ఊర్లకు వెళుతున్నారు అనడానికి ఎలాంటి సందేహం లేదు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, ఆర్ అండ్ బి అధికారులు కోడూరు మండలంపై ప్రత్యేక దృష్టి సారించి మండల ప్రజలకు రోడ్ల సమస్యపై శాశ్వత పరిష్కారం చూపుతారని మండల ప్రజలు ఆశిస్తున్నారు.

ఘనంగా శరన్నవరాత్రి మహోత్సవాలు

ప్రజాశక్తి-గుడివాడ

గుడివాడలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. స్థానిక శ్రీభీమేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో మంగళవారం శ్రీ గాయత్రి దేవి అలంకారంలో, శ్రీగౌరీశంకరస్వామి దేవస్థానంలో శ్రీమహాలక్ష్మీ దేవి అలంకారంలో, శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో శ్రీగజలక్ష్మీ దేవి అలంకారంలో, శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీసంతానలక్ష్మీ దేవి అలంకారంలో అమ్మవారు యాత్రికులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.వి.గోపాలరావు, ఆలయ సిబ్బంది, యాత్రికులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీ గజలక్ష్మి దేవి అలంకారంలో అమ్మవారు యాత్రికులకు దర్శనమిచ్చారు. శ్రీ విఘ్నేశ్వర, శ్రీ గణేశ భక్త బృందం తలకటూరు, కాలేఖాన్ పేట వారిచే భజన కార్యక్రమం జరిగాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాదర్తి సిస్టర్ గుడివాడ వారిచే కూచిపూడి నృత్యం, మచిలీపట్నం రంగస్థలం కళాకారుల సంక్షేమ సంఘం శ్రీ సధా హరిచంద్ర పూర్తి నాటక ప్రదర్శన తదితర కార్యక్రమాలు జరిగాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు, ఉత్సవ కమిటీ సభ్యులు, యాత్రికులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే మద్యం దుకాణాలు కేటాయింపు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం దుకాణాలకు పటిష్టవంతంగా పాటలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక మచిలీపట్నం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం ఐదు గంటలతో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగుస్తుందని, 11వ తేదీ ఉదయం 8 గంటల నుండి మద్యం దుకాణాలకు పాటల నిర్వహణ ప్రారంభమవుతుందని, ప్రతి దరఖాస్తుదారునికి పాటలు నిర్వహించే ప్రదేశం, సమయం వివరాలు వారి మొబైల్‌కు ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేయాల్సి ఉంటుందని కలెక్టర్ సూచించారు. మద్యం దుకాణాలకు పాటల నిర్వహణ పారదర్శకంగా నిర్వహించాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. మచిలీపట్నం ఎక్సైజ్ సూపరింటెంట్ జి గంగాధర్ రావు, సహాయ ఎక్సైజ్ సూపరింటెంట్ సి భార్గవ్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

అవినీతికి కేరాఫ్ జగన్ : ఆలపాటి

ప్రజాశక్తి-పెడన: గత ఐదేళ్ల పాలనలో అవినీతి, అరాచక, దోపిడీ, రాజధాని, పరిశ్రమలు లేని రాష్ట్రంగా అవినీతి చక్రవర్తికి నిలువుటద్దం జగన్మోహన్‌రెడ్డి అని కృష్ణ, గుంటూరు జిల్లాల ఉమ్మడి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ దుయ్యబట్టారు. మంగళవారం స్థానిక తోటమాలలోని టిడిపి కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ వైసిపి హయాంలో విద్యను నాశనం చేస్తూ గంజాయి వనంలా రాష్ట్రాన్ని మార్చేశారన్నారు. వ్యవస్థలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. 2014లో అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం ఆదాయ వనరులు లేకపోయినప్పటికీ ప్రజలను భాగస్వామ్యం చేసి రాజధాని నిర్మించడానికి పూనుకుందని గుర్తు చేశారు. అలాంటి రాజధాని లేకుండా మూడు రాజధానులు పేరుతో కాలయాపన చేయడం వల్లే జగన్ పార్టీకి ఈ దుస్థితి దాపురించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో వరదలతో అతలాకుతమైపోయిన రైతులకు పెద్దదిక్కుగా నిలబడి చంద్రబాబు నాయుడు నష్టపరిహారం పక్షం రోజులు గడవక ముందే అందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, జనసేన పార్టీ సీనియర్ నాయకులు కూనపురెడ్డి రంగయ్య నాయుడు, పెడన నియోజవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త పంచకర్ల సురేష్, పుప్పాల రామాంజనేయులు, సర్పంచులు పరసా లక్ష్మి కామేశ్వరరావు, జోగి నాగ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చల్లపల్లి: పామర్రు ప్రగతి కాలేజీ క్యాంపస్‌లో గ్రూప్-2 మెయిన్స్ కోచింగ్ తీసుకుంటున్న దిరిశం తేజశ్రీకి పలువురు ఆర్థిక సాయం అందజేశారు. చల్లపల్లికి చెందిన బోలెం భాస్కరరావు చారిటబుల్ ట్రస్టు, రావెళ్ల కృష్ణ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఛైర్మన్లు బోలెం రామారావు, బోలెం నాగమణి, రావెళ్ల ఉదయ్‌కుమార్ సంయుక్తంగా అందించిన రూ.20 వేల ఆర్థిక సాయాన్ని మంగళవారం విద్యార్థినికి అందజేశారు.

రూ.10.13 కోట్లతో అభివృద్ధి పనులు : రాము

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలంలో రూ.10.13 కోట్ల నిధులతో 78 సీసీ రోడ్లు, 22 సీసీ డ్రైన్లు, 87 మినీ గోకులం అభివృద్ధి పనులు జరగనున్నాయని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. ఈ సందర్భంగా ప్రజా వేదికలో మండల అధికారులతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్, పంచాయతీరాజ్, ఎనర్జీఎస్ ఇలా అవకాశమున్న ప్రతి శాఖలో నిధులు సాధించి ప్రజలకు మంచి చేసేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 14వ తేదీ నుండి గ్రామాల్లో జరగనున్న 'పల్లె పండుగ' కార్యక్రమంలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, గుడివాడ, నందివాడ మండలాల ఎండిఓలు విష్ణు ప్రసాద్, మల్లీశ్వరి, గుడ్లవల్లేరు మండల ఈఓపిఆర్‌డి సారధి, ఎం.ఇమ్రాన్, గుడివాడ ఎఇ సూరిబాబు, ఉపాధి హామీ ఇంజనీరింగ్ కన్సల్టెంట్ రామకృష్ణ, ఆర్డబ్ల్యుయస్ ఎఇ అట్లూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా

పట్టించుకోని అధికార యంత్రాంగం

ట్రాక్టర్లలోకి లోడ్ చేస్తున్న ఇసుక

ప్రజాశక్తి - వత్సవాయి : మండలంలోని కన్నెవీడు, సింగవరం, పోచవరం, తదితర గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా రాత్రి 11 గంటల నుండి తెల్లవారుజామున నాలుగు గంటల వరకు జోరుగా సాగుతోంది. సింగవరం గ్రామంలో జెసిబితో లోడ్ చేయించుకొని ట్రాక్టర్ల సహాయంతో పెనుగంచిప్రోలు సింగవరం రెండు గ్రామాల సరిహద్దు డొంకల్లో పత్తి పొలాల్లో డంపు చేసి లారీలకు లోడ్‌చేసి హైదరాబాదు తరలిస్తున్నారు. ఒక లారీ ఇసుక రూ.40 వేలు ధర పలకడంతో సింగవరం గ్రామంలో అధికార పార్టీ నాయకులు పోలీసులతో కుమ్మక్కై నెల రోజుల నుండి రవాణా సాగిస్తున్నారు. సింగవరం మునేరు నుండి డంపు యార్డ్ వరకు జెసిబిలతో డొంక రోడ్డు బాగు చేసి ట్రాక్టర్లు తిరిగేలా తయారు చేశారు. అధికారం మాది అంటూ మేనమేషాలు లెక్కేస్తున్నారు. రాత్రి వేళల్లో సింగవరం నుండి సుమారు పది ట్రాక్టర్ల వరకు తిరుగుతున్నట్లు గ్రామస్తులు తెలుపుతున్నారు. చుట్టుపక్కల గ్రామాలైన చిట్యాల, మక్కపేట, పెనుగంచిప్రోలు, లింగగూడెం తదితర గ్రామాలకు ఇసుక తరలిస్తున్నారు. ఒక్కొక్క ట్రాక్టర్ రూ.4వేలు ధరకు ఇసుక అమ్ముతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఆ గ్రామంలో అధికార పార్టీ నాయకులదే హవా నడుస్తోంది. కన్నెవీడు గ్రామంలో మున్నేరు నుండి ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. కన్నెవీడు నుండి చినమోదుగుపల్లి, పెద మోదుగుపల్లి, మంగోల్లు, గోపి నేని పాలెం, తిరుమలగిరి, దేశ్ పాలెం తదితర

ఇసుక తరలింపునకు అనువుగా మార్చిన డొంక రోడ్డు


వేరే ప్రాంతానికి తరలించేందుకు పత్తి చేనులో డంప్ చేసిన ఇసుక

గ్రామాలకు ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. కన్నెవీడు గ్రామ పరిధిలో ఫీల్డ్ లేబర్ సొసైటీ పరిధిలో 56 ఎకరాల భూమి ఉంది. ఇటీవల కురిసిన తుఫానులకు ఇసుక మేట వేయడం, ఆ ఇసుక మెత్తగా ఉండటంతో ట్రాక్టర్ యజమానులు ఆ ఇసుకను పగలు రాత్రి తేడా లేకుండా తరలిస్తున్నారు. ఈ గ్రామ పరిధిలో సుమారు 10 ట్రాక్టర్ల వరకు తిరుగుతున్నాయి. పోచవరం మునేటి లంక నుంచి వత్సవాయి గ్రామాల నుండి ట్రాక్టర్ యజమానులు ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. అధికారులు స్పందించి ఈ అక్రమ రవాణాను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆందోళన చేస్తున్న కార్మికులు

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - విజయవాడ : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎం. సోమేశ్వరరావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. గత 30 సంవత్సరాలుగా పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు అతి తక్కువ వేతనాలతో జీవనం కొనసాగిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. పంచాయతీ కార్మికులుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరినీ వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రామపంచాయతీ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తారని ఆయన హెచ్చరించారు. సిఐటియు విజయవాడ రూరల్ కార్యదర్శి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

విజయవాడ రూరల్ : విధులు నిర్వహిస్తూ గాయాలపాలై చికిత్స పొందు తున్న కార్మికుడు చంద్ర శేఖర్‌ను సిఐటియు నాయకులు మంగళ వారం ఆస్పత్రిలో పరామర్శిం చారు. విజయవాడ రూరల్ మండలం అంబాపురం పంచాయతీలో కొక్కిలగడ్డ చంద్రశేఖర్ అనే కార్మికుడు విధులు నిర్వహిస్తుండగా ప్రమాదం జరిగింది. బాధితునికి ఆరోగ్యశ్రీ ద్వారా విజయవాడ స్వర ఆస్పత్రిలో తుంటికి బాల్ వేశారు. ఈ నేపథ్యంలో సిఐటియు నాయకులు కార్మికుడును పరామర్శించి వివరాలడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరరావు, సిఐటియు విజయవాడ రూరల్ కార్యదర్శి వెంకటేశ్వరరావు, సిపిఎం నాయకులు ఆంజనేయులు పాల్గొన్నారు

పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి - విజయవాడ : ఇపిఎస్ 95 పెన్షనర్ల ఆల్ ఇండియా కమిటీ, ఎపిఆర్‌పిఎ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ రోజు విజయవాడ దుర్గ అగ్రహారంలో గల సహాయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ జిల్లా కార్యాలయం ముందు పెన్షనర్ల ధర్నా జరిగింది. ఈ ధర్నానుద్దేశించి రాష్ట్ర అధ్యక్షులు శాస్త్రి మాట్లాడుతూ ఆగస్టు 6,7,8 తేదీల్లో ఢిల్లీలో జరిగిన జాతీయ ధర్నా సందర్భంగా కేంద్ర మంత్రి షుక్ మాండా వియా పెన్షనర్ల సమస్యలు తెలుసుకొని ఒక నెలరోజుల వ్యవధిలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కానీ నేటికీ ఏ సమస్య పరిష్కారం జరగలేదన్నారు. పెన్షనర్ల న్యాయ బద్ధమైన డిమాండ్లు కనీస పెన్షన్ రూ.9వేలు, కరువు భత్యం అందరికీ హయ్యర్ పెన్షన్ మొదలుగా డిమాండ్లు సాధించే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాకు హాజరైన నగర సిఐటియు నాయకులు ఎంవి.సుధాకర్ మాట్లాడుతూ పాలకులు మారి పాలక విధానాలు మారితేనే సమస్యలు పరిష్కరించ బడతాయన్నారు. సమస్యలపై పెన్షనర్లు పెద్ద ఎత్తున నినదించారు. జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, ఎల్ఐసి నాయకులు ఎంఎన్ పాత్రుడు, అవనిగడ్డ పున్నారావు, మాట్లాడారు. అనంతరం పిఎఫ్ జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చి సమస్యలపై చర్చించారు. వినతిపత్రాన్ని కేంద్ర మంత్రికి పంపాలని కోరారు.

ధర్నా చేస్తున్న పెన్షనర్లు
(పక్కన) పిఎఫ్ జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న పెన్షనర్లు

శ్యామ్‌సంగ్ కార్మికుల తొలగింపుపై నిరసన

ప్రజాశక్తి - తిరువూరు : తమిళనాడులో సమ్మె చేస్తున్న శ్యామ్‌సంగ్ కార్మికులను విధుల నుంచి తొలగించడానికి నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో తిరువూరు నగర పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి బలగాని వెంకటేశ్వరావు మాట్లాడుతూ తమిళనాడు శ్యాంసంగ్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కార్మిక చట్టాల ప్రకారం 21 రోజుల ముందు సమ్మె నోటీస్ ఇచ్చినా యాజమాన్యం స్పందించలేదని, అనేకసార్లు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించు కోలేదని చెప్పారు. ఆ సందర్భంలో 28 రోజుల నుండి సమ్మె చేస్తుంటే కార్మికులను పిలిచి చర్చించకుండా విధులను తొలగించడం చాలా దుర్మార్గమని, తక్షణమే కార్మిక శాఖ అధికారులు జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాలని వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. యువకులకు వేతనాలు పెంచి, పని భద్రత కల్పించాలని, అక్రమంగా తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు మోదుగు సురేష్, కృష్ణవేణి, మారిపోవు నాగరాజు, నరసరావు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

నిరసనలో పాల్గొన్న కార్మికులు

వరద సాయంపై దృష్టి సారించాలి : కాశీనాథ్

మాట్లాడుతున్న కాశీనాథ్

ప్రజాశక్తి - విజయవాడ : వరద బాధితులకు అండగా నిలిచి, వారి సమస్యలపై పోరాడుతున్న సిపిఎం నేతలపై అవాకులు, చవాకులు మాట్లాడకుండా ప్రభుత్వం నుంచి సాయం రాబట్టడంలో టిడిపి నేతలు దృష్టి సారిస్తే బాగుటుందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాద్ పేర్కొన్నారు. శ్రీశ్రీ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆపార్టీ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి భూపతి రమణారావుతో కలిసి మాట్లాడారు. బుడమేరు, కృష్ణానది వరదలకు ఎన్ని కుటుంబాలు నష్టపోయాయి, ఎన్ని కుటుంబాలను గుర్తించారు, సాయం ఎన్ని కుటుంబాలికిచ్చారు, ఎంత మందికివ్వాలో ప్రభుత్వం వెంటనే ప్రకటన చేయాలన్నారు. సాయం అందరికీ ఇచ్చేశామని ప్రభుత్వం ఒక వైపు ప్రచారం చేస్తుండగా, నేటికీ 16 వేల అర్జీలు పెండింగ్‌లోనే ఉన్నట్లు పలు నివేదికలు తేటతెల్లం చేస్తున్నాయన్నారు. సిఎం సహాయ నిధికి రూ.500 కోట్లకు పైగా దాతల నుంచి విరాళాలు వచ్చాయని, కానీ కేంద్రం ఇస్తానన్న రూ. ఏడు వేల కోట్లు నేటికీ ఇవ్వలేదని అన్నారు. బాధితులకు అనేక రూపాల్లో అండగా నిలిచిన సిపిఎం నాయకులపై విమర్శలు చేయడం మానుకొని, బాధితులకు సాయం చేస్తే మంచిదని అన్నారు. రెండవ సారి ఎన్యుమరేషన్ చేసి సాయం అంధిస్తే బాగుంటుందని అన్నారు. ప్రభుత్వం తప్పిదం వలనే వరద వచ్చిందని, దానిని నివారించడంలో కూడా ప్రభుత్వం ఘోరంగా విఫలమ యిందని, చివరకు బాధితులను ఆదుకోవడంలో కూడా ప్రభుత్వం వైఫల్యం చెందిందని అన్నారు. ఇప్పటికయినా వరద సాయం 25 వేల నుంచి రూ.50 వేల వరకు పెంచి వరద బాధితులను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు.

ఉత్సవాల నిర్వహణలో కూటమి ప్రభుత్వ వైఫల్యం : కర్నాటి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : దుర్గగుడిలో దసరా ఉత్సవాల నిర్వహణలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని దుర్గగుడి పాలకమండలి చైర్మన్ కర్నాటి రాంబాబు ఘాటుగా విమర్శించారు. మంగళవారం చిట్టినగర్ కె.ఎల్.రావు పార్క్ వద్ద ఉన్న తన కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. దుర్గగుడి ఉత్సవాలను అడ్డం పెట్టుకుని కూటమి నాయకులు దోపిడీకి పాల్పడుతున్నారని, జీరో టిక్కెట్ విధానంతో యాత్రికులను దోచుకుంటూ దుర్గమ్మ ఆదాయానికి గండి కొడుతున్నారని విమర్శించారు. దుర్గగుడిలో యాత్రికులకు తగిన సౌకర్యాలను కలుగజేయడంలో దుర్గగుడి ఇఒ, అధికారులు విఫలమయ్యారని రాంబాబు విమర్శించారు. తనకు ఆహ్వాన పత్రికను కూడా తన పేరు లేకుండా చిన్న స్థాయి ఉద్యోగితో పంపించారని చెప్పారు. ఇటువంటి అనైతిక చర్యలకు కూటమి ప్రభుత్వం పాల్పడటం హేయమని అన్నారు.

మాట్లాడుతున్న కర్నాటి రాంబాబు

గ్రంథాలయంలో మెమరీ టెస్ట్

విజయవాడ : ఠాగూర్ గ్రంథాలయంలో దసరా సెలవుల్లో విద్యార్థులకు మానసిక ఉల్లాసం కోసం విద్యార్థులకు మెమరీ టెస్ట్ నిర్వహించారు. కొన్ని రకాల వస్తువుల పేర్లను చూసిన తర్వాత వారి మెమరీ టెస్ట్‌ను ఈ పరీక్ష ద్వారా గుర్తించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.రమాదేవి పాల్గొన్నారు.

శిలువ ప్రతిష్ట వార్షికోత్సవం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల పరిధిలోని జగ్గవరపుగుట్ట, రూపాంతరపు కొండపై రెడ్డిగూడెం సిఎస్ఐ క్రైస్ట్ చర్చి ఆధ్వర్యంలో శిలువ ప్రతిష్ట వార్షికోత్సవం 23వ వార్షికోత్సవ ఆరాధన వేడుకలు ఘనంగా జరిగాయి. రెవ జి.విశ్వనాథ్ ఆధ్వర్యంలో క్రైస్తవ భక్తులు ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విస్సన్నపేట డీనరీ చైర్మన్ కె.బాబురావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ విశ్వనాథపల్లి ఇమ్మానుయేలు, పెద్దలు, యాత్రికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భారీగా మద్యం దరఖాస్తులు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: జగ్గయ్యపేట ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సర్కిల్ పరిధిలో జగ్గయ్యపేట పట్టణంలో నాలుగు షాపులు, జగ్గయ్యపేట మండలం రూరల్ పరిధిలో నాలుగు షాపులు, వత్సవాయి మండల పరిధిలో రెండు షాపులు వెరసి పది కొత్త మద్యం పాలసీ ద్వారా షాపులకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఈ నెల 9వ తేదీ బుధవారంతో లాటరీ ద్వారా మద్యం షాపులు కేటాయింపుకు అప్లికేషన్ గడువు దగ్గర పడుతుండటంతో సుమారు 225 అప్లికేషన్ లు కార్యాలయానికి అందాయి. జగ్గయ్యపేట ప్రాంతం సర్కిల్ పరిధిలో ప్రభుత్వ ఖజానాకు ఆదాయం చేకూర్చడంలో రాష్ట్రంలో, జిల్లా స్థాయిలో మొదటి స్థానం దక్కించుకునే పరిస్థితులుండే అవకాశం ఉంది. ఈ నెల 11 వ తేదీ ఉదయం 8 గంటలకి లాటరీ తీసే ఏరియా అడ్రసు ఇబ్రహీంపట్నంలో గల స్వర్ణా కన్వేషన్ గా మారిందని లాటరీలో పాల్గొన్నే వారు గమనించాలని సిఐ బి గురవయ్య తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి గంగాధర్‌రావు

గంజాయి రహిత జిల్లాగా మారుస్తాం : ఎస్‌పి

8 కిలోల గంజాయి స్వాధీనం, నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-గుడివాడ (పెదపారుపూడి)

కృష్ణాజిల్లాలో గంజాయి ఆనవాళ్లు లేకుండా జల్లెడ పడుతున్నామని, గంజాయి రహిత జిల్లాగా మార్చడంలో జిల్లా పోలీస్ యంత్రాంగం కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు పేర్కొన్నారు. మంగళవారం పెదపారుపూడి పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పి మాట్లాడుతూ పెదపారుపూడి ఎస్సై ప్రవీణ్ కుమార్‌కు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు 8వ తేదీ ఉదయం 11 గంటల సమయంలో పెదపారుపూడి గ్రామ శివారు స్మశానంలో బహిరంగ ప్రదేశంలో గంజాయి సేవిస్తూ విక్రయాలకు పాల్పడుతున్న వారి సిబ్బందితో తనిఖీ చేయగా 16 మంది వ్యక్తులు గంజాయి సేవిస్తూ వారి వద్ద ఉన్న గంజాయిని విక్రయించడానికి పంచుకుంటూ ఉన్నారన్నారు. వెనువెంటనే ఎస్ఐ వారందరినీ అదుపులోనికి తీసుకొని వారి వద్ద నుండి 8 కిలోల గంజాయి, ఒక మోటార్ సైకిల్, 6 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకోవడం జరిగింది. నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా 16 మంది రూ.16 వేలు కలెక్ట్ చేసుకుని వారిలో ఆరుగురు వ్యక్తులు రెండు మోటర్ సైకిల్స్ మీద అల్లూరి సీతారామరాజు జిల్లా సీలేరు వెళ్లి రూ.10 వేలకు పది కిలోల గంజాయి కొనుగోలు చేసి మిగిలినవి మార్గమధ్యలో భోజనాలకు ఖర్చు చేసినట్లు తెలిపారు. కొనుగోలు చేసి తీసుకువచ్చిన గంజాయిని 16 మంది పంచుకోనున్నట్లు, అందరూ మద్యం తాగడం కోసం ఫణీంద్ర అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై బీరు బాటిల్స్ తేవడానికి వెళ్లినట్లు, మిగిలిన రెండు కిలోల గంజాయి అతని వద్ద ఉన్నట్లు తెలిపారు. వారు చెప్పిన సమాచారం ప్రకారం అతన్ని పట్టుకోవడానికి వెళ్లగా అతను పరారయ్యాడు. తర్వాత వారిపై పెదపారుపూడి పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ కేసును పామర్రు ఇన్స్పెక్టర్ వి.శుభకర్ దర్యాప్తు చేస్తున్నారన్నారు. ఈ కేసులో ఇంకా ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉండగా పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న మండలి

ఉపాధ్యాయులకు అభినందనలు

ప్రజాశక్తి-అవనిగడ్డ: ఇటీవల కృష్ణా నదికి వచ్చిన వరదల వల్ల తీవ్రంగా నష్టపోయిన బాధితులకు ఉపాధ్యాయుల సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. మంగళవారం అవనిగడ్డలోని బుద్ధ ప్రసాద్ కార్యాలయం వద్ద బాధితులకు సహాయం అందించిన ఉపాధ్యాయ సంఘాల వారిని సత్కరించారు. ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ రూ.29,78,185లతో 2600 మంది వరద బాధిత కుటుంబాలకు వంట పాత్రలు, కుక్కర్లు పంపిణీ చేశారన్నారు. ఈ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములైన ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు యూనియన్ నాయకులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు టీవీఎం రామదాసు, గోపాల్, వి.శ్రీనివాసరావు, అన్నపరెడ్డి పిచ్చయ్య, యుటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బి కనకారావు, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి సాంబశివరావు, పిఆర్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి కె రాజా, రవివర్మ, డిపిఆర్టియు జిల్లా కార్యదర్శి బచ్చు రాఘవ శ్రీనివాసరావు, ఏపీటీఎఫ్ నాయకులు సిహెచ్ నాగప్రసాద్, యుటిఎఫ్ నాయకులు నారంశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు చర్యలు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం అమరావతి రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సాగునీటి వ్యవస్థకు పునరుజ్జీవం తీసుకురావాలని నిర్ణయించారని, నిర్వీర్యమైన సాగు నీటి వ్యవస్థను సాగునీటి సంఘాల ద్వారా రైతుల ప్రాతినిధ్యంతో కాలువల పూడిక, మరమ్మతులు, గేట్లు, గట్ల బలోపేతం వంటి వాటికి నిర్వహణ, పర్యవేక్షణకు సాగునీటి సంఘాలు పనిచేస్తాయని, వీటికి త్వరలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. జిల్లాలో ఇరిగేషన్ శాఖకు సంబంధించిన ఎస్ఈ పోస్టు ఖాళీగా ఉందని, భర్తీ చేయాలని కలెక్టర్ మంత్రిని కోరగా, త్వరలో అందుకు సంబంధించిన అధికారిని నియమిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వ సూచనల మేరకు ఆయకట్టు, డిస్ట్రిబ్యూటరీలు, ప్రాజెక్టుల పరిధిలో కొత్తగా వచ్చిన ప్రాంతాలను కలిపి ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ డిఆర్ఓ కె చంద్రశేఖర రావు, ఇరిగేషన్ శాఖ ఈఈ లు పీవీ కస్తూరావు, కొడాలి బాబు, మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవోలు కే స్వాతి, జి బాలసుబ్రమణ్యం, బిఎస్ హేలా షారోన్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ బహూకరణ

ప్రజాశక్తి-అవనిగడ్డ

పెదకళ్లేపల్లి స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో మోపిదేవి గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌కు రూ.40 వేలు విలువ చేసే డెల్ కంపెనీ కంప్యూటర్‌ను దాతలు కోళ్ల చలపతిరావు, అక్కి పంతుల రవితేజ, సంస్థ అధ్యక్షులు బండారు మధుబాబు మంగళవారం ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ చేతుల మీదుగా ఉపాధ్యాయులు కే.ఉమామహేశ్వరరావు, ఎస్ వెంకటేశ్వరరావు, ఎస్ఎస్ స్వామి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ చోడే శ్రీనులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బి.సాంబశివరావు, సంస్థ సభ్యులు అర్ధ చలపతిరావు, అమ్మారావు, మారుబోయిన రామాంజనేయులు, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 35 మంది ఎంపిక

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్డీఏ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో 35 మందిని వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఎంపిక చేసినట్లు చెప్పారు. మొత్తం 57 మంది జాబ్ మేళాకు హాజరు కాగా అందులో 35 మందిని ఎంపిక చేసినట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఈ విక్టర్ బాబు, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి డాక్టర్ పి నరేష్ కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నేషనల్ కా రీర్ యంగ్ ప్రొఫెషనల్ ఎస్ జె రాజు మాట్లాడుతూ అధిక సంఖ్యలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగాలను కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని చెప్పారు. కళాశాల ఎకనామిక్స్ హెచ్ఒడి వీరకుమారి మాట్లాడుతూ ఉద్యోగం చిన్నదా పెద్దదా అన్న అపోహను యువత

పెట్టుకోవద్దని ఉద్యోగం చేసుకుంటూ వెళితే అదే ఆ వ్యక్తులను ఉన్నత స్థితికి తీసుకువెళుతుందని తెలిపారు. ఈ జాబ్ మేళాలో టెక్నో టాస్క్ బిజినెస్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, నవత రోడ్డు ట్రాన్స్పోర్ట్, ప్రగతి మహిళా అకాడమీ, ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల స్కిల్ హబ్ ఇంచార్జ్ ముత్యాల వెంకటేశ్వరరావు, కామర్స్ లెక్చరర్ ఎలిజబెత్ తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు-లంకపల్లి మధ్య వంతెన పూర్తయ్యేనా ?

ప్రజాశక్తి-ఉంగుటూరు

ఉంగుటూరు-లంకపల్లి మధ్య వంతెన ఐదు దశాబ్దాల క్రితం నిర్మించారు. ఆనాటి పరిస్థితులకు అనుగుణంగా బుడమేరు వరద ఉధృతి ఎక్కువగా ఉన్నా వంతెన పైనుంచి నీరు కిందికి పోయే విధంగా ఏర్పాట్లు చేశారు. ఆ తర్వాత నీటి ప్రవాహం ఉధృతంగా ఉండటంతో తాటి దోనెల సహాయంతో ప్రజలు ప్రయాణం కొనసాగించారు. వరదలు వచ్చిన ప్రతిసారి నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఉంగుటూరు-లంకపల్లి మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. మండలంలో మొత్తం 30 గ్రామాలు

పిల్లర్ల వరకే పూర్తయిన వంతెన

ఉంటే లంకపల్లి వైపు 12 గ్రామాలు, ఉంగుటూరు వైపు 18 గ్రామాలు ఉండి ఒకరితో ఒకరికి సంబంధం లేకుండా విడిపోతున్న పరిస్థితి ఏర్పడుతుంది. వరద సమయాల్లో ప్రయాణానికి ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అత్యవసర పరిస్థితుల్లో అనేక అవరోధాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. దీంతో అనేక సార్లు ప్రజలు ప్రజాప్రతినిధులకు, అధికారులకు అనేక మార్లు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ వంతెన నిర్మాణం చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో పలుమార్లు ధర్నాలు చేసినా పట్టించుకోవడంలేదు. 2014లో రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రంలో ఏర్పాటైన టిడిపి ప్రభుత్వానికి స్థానికులు మరోసారి వంతెన నిర్మాణ విషయం వివరించగా 2017లో నాటి ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ చేతులు మీదుగా శంకుస్థాపన చేశారు. అనంతరం బేస్మెంట్ పనులు ప్రారంభించారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత టిడిపిలోనూ, వైసిపిలోనూ వంశీమోహన్ శాసనసభ్యులుగా ఉండటంతో తిరిగి వంతెన నిర్మాణ పనులు ప్రారంభించారు. పనులకు నీటి ప్రవాహం ఆటంకంగా మారిందని వంతెన కింద భాగాన మూడు కానాల గుండా నీరు ప్రవహించకుండా పూడ్చి వేశారు. అనంతరం నిర్మాణానికి ఆటంకం లేకుండా పని సాగింది. పిల్లర్లు నిర్మాణం వరకు కొనసాగింది. ఏమైందో ఏమో అర్థం కాని ప్రశ్నగా పనులు అర్ధాంతరంగా నిలిపివేశారు. నిర్మాణానికి అవసరమైన జెసిబి, పిల్లర్ బాక్స్‌లు తదితర సామాగ్రి నేటికీ అక్కడే దర్శనమిస్తున్నాయి. వీటికి తోడు ఉంగుటూరు తహశీల్దార్ కార్యాలయానికి ఎదురుగా వంతెన నిర్మాణం కోసం నిల్వ చేసిన కంకర, ఇసుక, టిప్పర్లు, క్రేన్ లాంటి అనేక విలువైన సామాగ్రిని అక్కడే వదిలిన పరిస్థితి ఉంది. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడం వల్లే పనులు మధ్యలో నిలిపివేసినట్లు సమాచారం. గత నెలలో కురిసిన వర్షాలకు నీటి ప్రవాహం కిందకు ప్రవహించకపోవడంతో రోడ్డు వెంబడి పంట పొలాలు, ఆముదాలపల్లి గ్రామం నీటమునిగాయి. ఈ పరిస్థితుల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణమే స్పందించి వంతెన నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మచిలీపట్నం ఎంపిడిఒగా వెంకటేష్ బాధ్యతలు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: మచిలీపట్నం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా సిహెచ్.వెంకటేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గత ఐదు సంవత్సరాలుగా మచిలీపట్నం మండల పరిషత్ ఇంచార్జిల పాలనలో కొనసాగింది. ఇప్పటి వరకు ఇంచార్జి ఎంపిడిఒగా ఎ.బాలకృష్ణరావు బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమల్లో, మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

దసరా ఉత్సవాలకు నిబంధనలు

ప్రజాశక్తి-చల్లపల్లి: దసరా ఉత్సవాల సందర్భంగా డిజే వంటివి ఏర్పాటు చేయరాదని నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పి.వి.సుబ్రహ్మణ్యం విగ్రహ కమిటీ సభ్యులకు సూచించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో విగ్రహ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో అమ్మవారి ఉత్సవాలు జరుపుకోవాలని దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ డిఎస్‌పి డి.మురళీధర్, చల్లపల్లి సిఐ కె.ఈశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి-ఘంటసాల: ఘంటసాల మండలంలో పని చేసి ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా వేరే ప్రాంతానికి వెళ్లిన రెవెన్యూ ఉద్యోగులను మంగళవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. తహసీల్దార్ బి.విజయప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ, వీఆర్వోలు, వీఆర్ఎలు, కార్యాలయ సిబ్బంది కలసి గన్నవరం మండలానికి బదిలీపై వెళ్లిన డిప్యూటీ తహసీల్దార్ చప్పిడి చిట్టి బాబు, బాపులపాడు మండలం వీరవల్లి సచివాలయానికి బదిలీపై వెళ్లిన వీఆర్వోలు కర్రా నాగరాజు, గిరి ప్రసాద్ దుస్సాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. మండలంలో వారు అందించిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు.

48 మెగా పిక్సెల్‌తో సోనీ పాప్ 9

ప్రజాశక్తి. ఎడ్యుకేషన్ : సరికొత్త కూల్, కలర్‌ఫుల్ పాప్ 5జిని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు టెక్నో సంస్థ ఇన్‌ఛార్జి కె.కుమార్ తెలిపారు. నగరంలోని సోనీ రీజినల్ ఆఫీసర్ నన్జెదు ఏర్పాటు చేసిన విలేకరుల సమవేశంలో వివరాలను తెలిపారు, కళాశాల విద్యార్థులు, ట్రెండ్‌సెట్టర్‌ల కోసం రూపొందించబడిన ఈ స్మార్ట్‌ఫోన్ ప్రతి ఒక్కరికీ 5జిని అందుబాటులో ఉంచుతుంది. అన్నారు. మిడ్‌నైట్ షాడో, అజూర్ స్కై, అరోరా క్లౌడ్ వంటి కళ్లు చెదిరే రంగుల్లో ఈ ఫోన్ అందుబాటులో ఉంది అని తెలిపారు. ఈ విభాగంలో మొదటిసారిగా 48 మెగా పిక్సెల్ సోనీ ఏఐ కెమెరా, విభాగంలో మొదటి 5జిని ఎన్.ఎఫ్.సి.తో పాటు నాలుగు సంవత్సరాలకు పైగా లాగ్ ఫ్రీ అనుభవాన్ని కలిగి ఉన్న పాప్ 9 5జి కేవలం రూ. 8,499 ప్రారంభ ధర నుండి లభ్యమవుతుంది.అని తెలిపారు.

విద్యుత్ అధికారుల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి సెక్షన్‌లో విద్యుత్ శాఖ ఆకస్మిక తనిఖీలు మంగళవారం నిర్వహించింది. రూరల్ డివిజన్ ఇన్‌ఛార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యు.హనుమయ్య, విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించారు. బృందానికి ఇద్దరు చొప్పున మొత్తం 42 బృందాలుగా ఏర్పడి కొండపల్లి, ఈలప్రోలు, పారిశ్రామిక వాడ లలో 3031 సర్వీసులు తనిఖీ చేశారు. 168 సర్వీసుల మీద కేసులు నమోదు చేశారు. దీని తాలూకా రూ. 6 లక్షల 40 వేల 844 అపరాధ రుసుము విధించారు. విద్యుత్ వినియోగదారులు అధికలోడు వాడుతుంటే అదనపు లోడును క్రమబద్ధీకరించుకోవాలని, నిర్ణీత గడువు లోగా కరెంటు బిల్లులు చెల్లించాలని, 14 రోజుల లోపు కరెంట్ బిల్లులు చెల్లించిన వారికి అపరాధ రుసుము ఉండదని తెలిపారు. ఇబ్రహీంపట్నం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేవై కొండలరావు, విజిలెన్స్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.హరికిరణ్, రూరల్ డివిజన్ ఎఇలు, రూరల్ డివిజన్ విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

పిఎస్‌సిఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : స్థానిక కొత్తపేటలో గల శ్రీ పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో 2024 దసరా వేడుకలు మంగళవారం అత్యంత ఉత్సాహంగా జరిగాయి. ఈ కార్యక్రమాన్ని కార్యదర్శి, ఆర్థిక విభాగం అధిపతి చిత్త అమరసుధీర్, కోశాధికారి రాజా రాఘవయ్య మరియు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.కె.పతంజలి శాస్త్రి, పరీక్షల కంట్రోలర్, ప్లేస్మెంట్స్ డైరెక్టర్ డాక్టర్ మణికంఠ, డాక్టర్ డి.దుర్గాప్రసాద్, హెడ్, సిఎస్ఇ విభాగం, సంబంధిత ఇతర విభాగాధిపతులు డాక్టర్ మహాలక్ష్మి, డాక్టర్ పి.శిల్ప, డాక్టర్ రమాదేవి, కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం సెషన్లో విద్యార్థులచే బాతుకమ్మ, దాండియా, ఉత్తర భారత గర్బా ప్రదర్శనలు, ప్రత్యేక విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకర్షణగా నిలిచాయి. సిఎస్ఇ విద్యార్థుల ఉదయం సెషన్ భక్తి గీతం తరువాత అన్ని శాఖల నుండి శాస్త్రీయ నృత్యాలు జరిగాయి. కళాశాల ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు శ్రీకాంత్ రెడ్డి మరియు బందం కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సివిల్ సప్లయ్ గోదాము తనిఖీ

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు ఆర్డీవో గా బాధ్యతలు చేపట్టిన కె.మాధురి స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్ చౌకధరల సరుకు నిల్వ వుండే సివిల్ సప్లయ్ గోదామును సోమవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. రేషన్ షాపులకు సరఫరా చేసే నిత్యవసర సరుకుల సరఫరా, నిలువలు ఉన్న సరుకు ల రికార్డులను పరిశీలించారు. వినియోగదారులకు సకా లంలో రేషన్ సరుకులు అందజేయడానికి సిబ్బంది కృషి చేయాలని ఆమె సూచించారు. ఈకార్యక్రమంలో గోదా ము ఇన్ చార్జి నాగమణి, సిబ్బంది పాల్గొన్నారు.

మారెమ్మకు వస్త్రాలు సమర్పణ

ప్రజాశక్తి - విస్సన్నపేట : దసరా నవరాత్రుల సందర్భంగా మంగళవారం విస్సన్నపేట మండలం పుట్రేల గ్రామంలో అందరూ సంతోషంగా ఉండాలని కోరుకుంటూ మారెమ్మ తల్లి ఆలయంలో ఎన్నారై గిరి ఆధ్వర్యంలో ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నారై గిరి కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం
పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...
మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218
విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.